


14న చంద్రబాబు జిల్లా పర్యటన



అనకాపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఈ నెల 14న జిల్లాలో పర్యటించనున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న మధ్యాహ్నం 3 గంటలకు పాయకరావుపేటలో జరిగే ఎన్నికల ప్రచార సభలో చంద్రబాబు పాల్గొని ప్రసంగిస్తారని పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం 5 గంటలకు చోడవరంలో జరిగే ఎన్నికల ప్రచార సభలో కూడా పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు.

స్వయం ఉపాధి శూన్యం



బీసీ, ఎస్సీ, మైనారిటీ యువతకు గతంలో సబ్సిడీపై రుణాలు

- తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సుమారు 30కిపైగా సంక్షేమ పథకాలు అమలు
- ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో వందలాది మందికి లబ్ధి
- ఐదేళ్లలో రెండు శాఖల ఆధ్వర్యంలో సుమారు పది వేల మందికి రూ.300 కోట్ల రుణాలు
- చేతివృత్తిదారులకు 'ఆదరణ' పథకం కింద పరికరాలు పంపిణీ
- వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అన్నింటికీ స్వస్తి
- కేవలం బటన్ నొక్కుడుకే పరిమితం
- సంక్షేమ శాఖలు పూర్తిగా నిర్వీర్యం
- ఆ శాఖల ఏర్పాటు ప్రాథమిక లక్ష్యం నెరవేరని వైనం



విశాఖలోని సంక్షేమ భవన్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నిరుపేద యువతీయువకులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు బీసీ, ఎస్సీ, మైనారిటీ సంక్షేమ శాఖలు ఏర్పాటయ్యాయి. ఏ ప్రభుత్వం వచ్చినా సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు, ఆర్థిక సహకారం, వృత్తిదారులకు అవసరమైన పరికరాలు అందిస్తూ వచ్చాయి. ఇందుకోసం ఏటా ఒక్కో సంక్షేమ శాఖ రూ.కోట్లు కేటాయించేవి. కానీ, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత బీసీ, ఎస్సీ, మైనారిటీ సంక్షేమ శాఖల ద్వారా సాయం నిలిపివేసింది. సీఎం జగన్ బటన్ నొక్కుడుకే ప్రాధాన్యం ఇవ్వడంతో ఈ శాఖలకు పనిలేకుండా పోయింది. ఒకప్పుడు ఆయా కులాలకు చెందిన దరఖాస్తుదారులు, లబ్ధిదారులతో కళకళలాడిన సంక్షేమ శాఖలు...గడిచిన ఐదేళ్లుగా వెలవెలబోతున్నాయి.

వందలాది మందికి రుణాలు

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో వందలాది మందికి రుణాలను అందించారు. ఏటా సుమారు రూ.50 కోట్ల వరకు సబ్సిడీతో కూడిన రుణాలను అందించారు. ఐదేళ్లలో ఈ రెండు శాఖల ఆధ్వర్యంలో సుమారు పది వేల మందికి రూ.300 కోట్ల విలువజేసే రుణాలు మంజూరు చేసినట్టు చెబుతున్నారు. టీడీపీ హయాంలో ఈ శాఖల ఆధ్వర్యంలో సుమారు 30కిపైగా సంక్షేమ పథకాలు అమ లయ్యాయి. స్వయం ఉపాధి పొందే యూనిట్లు ఏర్పాటుకు బీసీ, ఎస్సీ కులాలకు చెందిన యువతకు రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకూ రుణాలుగా మంజూరుచేసింది. ఈ రుణాల్లో 35 నుంచి 60 శాతం వరకూ సబ్సిడీ ఉండేది. బ్యాంకులు ముందుకురాకపోతే ఎన్ఎస్ఎఫ్‌డీఎస్ సహకారంతో ప్రభుత్వమే రుణాలు ఇచ్చే ఏర్పాట్లుచేసింది. ఈ రుణాలతో నిరుద్యోగ యువత ఉపాధి పొందేందుకు పౌల్ట్రీ, డెయిరీ, మిల్లులు, చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేవారు. వీటి ద్వారా వాళ్లు ఉపాధి పొందడంతోపాటు మరింతమందికి ఉపాధిని కల్పించేవాళ్లు. వాటన్నింటికీ వైసీపీ ప్రభుత్వం మంగళం పాడేసింది.

ఎన్నో పథకాలు అమలు

బీసీ, ఎస్సీ, మైనారిటీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో అమలుచేసిన పథకాలతో వందలాది మంది లబ్ధి పొందేవారు. ఇందుకోసం ప్రభుత్వం ఒక్కో సంక్షేమ శాఖకు కనీసం రూ.25 కోట్ల రూపాయలు కేటాయించేది. ఆదరణ, సబ్సిడీ రుణాలు, విదేశీ విద్య, పెళ్లి కానుకలు, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ, బీసీ భవనాల నిర్మాణం, సబ్సిడీపై వాహనాల పంపిణీ, చంద్రన్న కానుకలు, మత్స్యకారులకు చెరువులు కేటాయింపు, బోట్ల ఆధునికీకరణ, వృత్తుల వారీగా అవసరమైన పరికరాలు పంపిణీ, మహిళా పారిశ్రామిక వేత్తలకు రాయితీలు, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటుకు అవసరమైన ... మిగతా 8వ పేజీలో

కుల వృత్తిదారులకు సహకారం ఏదీ?



బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని అనేక కులాలకు చెందిన కార్పొరేషన్లకు గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో భారీగా నిధులు అందేవి. సబ్సిడీతో కూడిన రుణాలు, ఆదరణ పథకంలో భాగంగా ఉపకరణాలు అందేవి. ఏటా రజక కార్పొరేషన్‌కు రూ.100 కోట్లు వచ్చేవి. రజకులకు ఇస్త్రీ పెట్టెలు, ఇస్త్రీ చేసుకునేందుకు బండ్లు వంటివి అందించాం. ఇంకా పరికరాలు కొనుగోలు చేసి ఉన్నా...ఈ ప్రభుత్వం పంపిణీ చేయలేదు. అలాగే దోబీఘాట్ల నిర్మాణానికి ఇవ్వాల్సిన నిధులను కూడా ఈ ప్రభుత్వం ఇతర పథకాలకు మళ్లించింది. గడిచిన ఐదేళ్లలో కుల వృత్తులు చేసుకునే వారికి కనీస సహకారాన్ని కూడా ఈ ప్రభుత్వం అందించలేదు.

- రాజమండ్రి నారాయణ, రజక కార్పొరేషన్ మాజీ చైర్మన్

వసతి లేని గృహాలు

- తలుపుల్లేని మరుగుదొడ్లు, కిటికీలు
- పెచ్చులూడిపోతున్న శ్లాబులు
- వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహణను గాలికొదిలేసిన వైనం
- విద్యార్థులకు తప్పని అవస్థలు

అధ్వానంగా ఎస్సీ బాలుర హాస్టళ్లు



తుప్పు పట్టి ఊడిపోయిన మరుగుదొడ్ల తలుపులు



నర్సీపట్నం ఎస్సీ బాలుర వసతి గృహం

నర్సీపట్నం, ఏప్రిల్ 10 :

నా ఎస్సీలు.. నా ఎస్టీలు... అంటూ ఊక దంపుడు ఉపన్యాసాలతో ఊదరగొట్టే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సాంఘిక సంక్షేమ వసతి గృహాల నిర్వహణను గాలికి వదిలేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ఐదేళ్లుగా ఎస్సీ వసతి గృహాల నిర్వహణను కనీసం పట్టించుకోలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

ఏఎస్‌డబ్ల్యూవో పరిధిలోని నర్సీపట్నం, గొలుగొండ, నాతవరం, మాకవరపాలెం, రోలుగుంట, రావికమతం మండలాల్లో గల పలు సాంఘిక సంక్షేమ వసతి గృహాలు శిథిలావస్థకు చేరిన భవనాల్లో నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా నర్సీపట్నం, గొలుగొండ, నాతవరం, కొత్తకోట బాలుర వసతి గృహాలు అధ్వానంగా ఉన్నాయి. భవనాల శ్లాబ్ పెచ్చులు ఊడి పోయి విద్యార్థుల మీద పడుతున్నాయి. కిటికీలు గుమ్మాలు, తలుపులు ఊడిపోతున్నాయి. విద్యార్థులకు సరిపడినన్ని గదులు, మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రెండో విడత నాడు- నేడు పథకంలో ఎస్సీ వసతి గృహాల అభివృద్ధికి పంపిన ప్రతిపాదనలు కాగితాలకు మాత్రమే పరిమితం అయ్యాయని విమర్శలు వస్తున్నాయి.

పెచ్చులు ఊడిపోతున్న భవనం శ్లాబ్

నర్సీపట్నం ఎస్సీ బాలుర వసతి గృహం భవనం పూర్తిగా శిథిలావస్థలో ఉంది. గురువారం శ్లాబ్ పెచ్చులు ఊడిపోయి పడి పోవడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. వసతి గృహంలో 120 మంది విద్యార్థులకు ఐదు గదులు ఉన్నాయి. విద్యార్థులు దుప్పట్లు పరుచుకొని కఠిక నేల మీద పడుకుంటున్నారు. కిటికీ రెక్కలు, గుమ్మాలు, తలుపులు కదిలిపోయి రేపో మాపో ఊడి పోయే పరిస్థితిలో ఉన్నాయి. ఇంత మంది విద్యార్థులకు నాలుగు మరుగుదొడ్లు ఉన్నాయి. మరుగుదొడ్ల తలుపులకు ఉన్న రేకులు తుప్పపట్టి ఊడిపోయాయి. వర్షం పడిందంటే గదులన్నీ కారిపోయి విద్యార్థులకు కంటి మీద కునుకు ఉండడం లేదు. కిటికీ రెక్కలు లేకపోవడంతో చలి కాలంలో అవస్థలు పడుతున్నారు. ప్రహరీ గోడ ఎత్తు లేక పోవడంతో రక్షణ లేకుండా పోయింది. సాంఘిక సంక్షేమ ఉన్నతాధికారులు, ఆర్డీవో, జిల్లా కలెక్టర్ కలెక్టర్ వసతి గృహాన్ని సందర్శించి వెళ్లడమే తప్పితే ఫలితం ఉండడం లేదు. హాస్టల్ భవనం అభివృద్ధికి ప్రభుత్వం నిధులు విదిల్చిన పాపాన పోలేదని విమర్శలు వస్తున్నాయి.

రెండేళ్లుగా ప్రహరీ గోడ లేక ఇబ్బందులు

నాతవరం ఎస్సీ బాలుర వసతి గృహంలో ప్రహరీ గోడ కూలిపోయి రెండేళ్లు దాటిపోయింది. అధికారులు పట్టించుకోలేదని విమర్శలు వస్తున్నాయి. ఇక్కడ వసతి గృహంలో 78 విద్యార్థులు ఉంటున్నారు. భవనం శిథిలాస్థలో ఉంది. వర్షం పడితే శ్లాబ్ నుంచి నీరు లీక్ అవుతుంది. శ్లాబ్ కాంక్రీట్ పెచ్చులు ఊడిపోతున్నాయి. స్నానం గదులకు తలుపులు ఊడిపోయాయి. భవనం పూర్తిగా శిథిలావస్థలకు చేరుకోవడంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు.

ప్రాథమిక పాఠశాలలో ఎస్సీ వసతి గృహం

గొలుగొండ ఎస్సీ బాలు వసతి గృహం శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ 82 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వసతి గృహం భవనం మెట్ల మార్గం పాడవ్వడంతో ఫిబ్రవరి ఐదో తేదీన ఒక విద్యార్థి సన్‌షేడ్ మీద నుంచి శ్లాబ్ మీదకు వెళ్లి విద్యుదాఘాతంలో మరణించాడు. ఈ ఘటనపై అధికారులు అక్కడ పని చేస్తున్న వసతి గృహ సంక్షేమ అధికారి మీద చర్యలు తీసుకొని చేతులు దులుపుకున్నారు తప్పితే భవనం మరమ్మతులకు నిధులు విడుదల చేయలేదు. ఉన్నఫలంగా వసతి గృహాన్ని ఖాళీ చేసి ప్రాథమిక పాఠశాలలో ఖాళీగా ఉన్న గదుల్లోకి విద్యార్థులను తరలించారు. ఎస్సీ వసతి గృహం భవన నిర్మాణానికి ప్రభుత్వం ఏ విధమైన చర్యలు తీసుకోలేదు. ఇదే విధంగా కొత్తకోట వసతి గృహం కూడా శిథిలాస్థలో ఉంది. భవనం శ్లాబ్ పెచ్చులు ఊడిపోతున్నాయి. విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ హాస్టల్‌లో తలదాచుకుంటున్నారు.

జోరుగా అక్రమ మద్యం రవాణా

పోలీసుల కళ్లుగప్పి జిల్లాలోకి ప్రవేశం


- చెక్ పోస్టులు ఉన్నా ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న వైనం



ఇటీవల మునగపాక మండలంలోని ఓ గ్రామంలో గడ్డి వాము కింద దాచివుంచిన అక్రమ మద్యం (ఫైల్)

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

ఎన్నికల వేళ జిల్లాలో అక్రమ మద్యం రవాణా జోరుగా సాగుతోంది. ఓ వైపు పోలీసు యంత్రాంగం తనిఖీలు చేస్తున్నా వారి కన్నుగప్పి ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం భారీ ఎత్తున జిల్లాకు వస్తున్నట్టు తెలిసింది. ఈ నెల 6న మునగపాక మండలంలోని ఓ గ్రామంలో గడ్డి వాములో భారీగా మద్యం నిల్వలను పోలీసులు స్వాధీనం చేసుకోవడం కలకలం రేపింది. 39,168 మద్యం సీసాలు పట్టుబడడంతో పోలీసులే అవాక్కయ్యారు. కాగా గత ఏడాది మాడుగుల మండలం గాదెరాయి గ్రామంలో మద్యం నిల్వలతో పట్టుబడిన వ్యక్తులే ఎన్నికల వేళ రాజకీయ పార్టీల నేతలకు మద్యం పంపిణీ చేసేందుకు రహస్య ప్రదేశాల్లో దాచినట్టు తెలిసింది.



అనకాపల్లిలో తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

చెక్ పోస్టులను దాటుకుంటూ..

ఎన్నికల సందర్భంగా పోలీసు అధికారులు జిల్లాలో తొమ్మిది చోట్ల చెక్ పోస్టులను ఏర్పాటు చేసి, నిరంతరం తనిఖీలు చేపడుతున్నారు. అయినా ఇతర రాష్ట్రాల నుంచి మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. గట్టి నిఘా ఉన్నా చెక్ పోస్టులను దాటుకుని అక్రమ మద్యం జిల్లాలోకి ఎలా వస్తుందో అర్థంకాని పరిస్థితి ఉంది.

ఓటర్ల జాబితాలో అభ్యంతరాలను పరిష్కరిస్తాం

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీల నుంచి అందిన అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరిస్తామని, ప్రతి అభ్యంతరానికి తగిన ఆధారాలు సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 16వ తేదీ వరకు ఉన్న సప్లిమెంటరీ ఓటర్ల జాబితా ఏప్రిల్ 25న అందజేస్తామని తెలిపారు. ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ, 29వ తేదీ వరకు ఉపసంహరణ ఉంటుందన్నారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలపై కమిషనింగ్ ఉంటుందన్నారు. తరువాత ఈవీఎంల ర్యాండమైజేషన్ జరుగుతుందని తెలిపారు. దీనికి అన్ని పార్టీల ఏజెంట్లను పంపాలని కోరారు. పార్లమెంట్ ఏఆర్‌వో జిల్లా రెవెన్యూ అధికారి ఆధ్వర్యంలో ఎన్నికల సౌకర్య కేంద్రం నిర్వహించనున్నామన్నారు. ఓటరు గైడ్ సేవా అనే కరపత్రాన్ని విడుదల చేశామని, దానిలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఓటరుగా నమోదు, దివ్యాంగులకు, 85 సంవత్సరాలు దాటిన వారికి ఓటు వేసేందుకు కల్పిస్తున్న సౌకర్యాలు, ఎన్నికలు, పార్టీలు, ఓటింగ్ చేయడంపై పూర్తి వివరాలు ఉంటాయన్నారు. నామినేషన్లకు ముందు ఇంటింటి ప్రచారానికి ఎటువంటి ఆంక్షలు లేవని, శాంతి భద్రతల దృష్ట్యా స్టేషన్ హౌస్ అధికారికి సమాచారం ఇవ్వాలని, ఎన్నికల నిబంధనలను తప్పక పాటించాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌వో దయానిధి, ఎన్నికల విభాగం అధికారి రామ్మూర్తి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు, ఎంపీపీ గొర్లె సూరిబాబు (వైసీపీ), అల్లు రాజు (సీపీఎం), డి.సంతోశ్ (కాంగ్రెస్), హరనాథబాబు (ఆమ్‌ఆద్మీ), చిన్నారావు (బీఎస్పీ) హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

సాగునీటి వనరులపై నిర్లక్ష్యం

ధారగెడ్డ మొదటి ఆనకట్ట మరమ్మతులకు గుర్తైనా పట్టించుకోని పాలకులు

- ఐదేళ్లుగా ప్రతిపాదనలే తప్ప నిధులు మంజూరుకాని వైనం
- నష్టపోతున్న రైతులు

గొలుగొండ, ఏప్రిల్ 10:

ధారగెడ్డ మొదటి ఆనకట్ట శిథిలావస్థకు చేరడంతో ఏటా సాగునీటికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఐదేళ్లుగా ప్రతిపాదనలే తప్ప నిధులు మంజూరు కావడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. మండలంలో పాతమల్లంపేట గ్రామ పంచాయతీలో గల ధారగెడ్డ తొలి ఆనకట్ట వద్ద ఎండా కాలంలోనూ నీరు ప్రవహిస్తూనే ఉంటుంది. అయితే ఈ ఆనకట్ట ఐదేళ్లుగా మరమ్మతులకు గురికావడంతో పాలకులు, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

ఆనకట్ట కింద సుమారు వేయి ఎకరాలు సాగుభూమి ఉంది. ఖరీఫ్, రబీ సాగు చేపడుతుంటారు. నిత్యం గెడ్డలు ప్రవహించినప్పటికీ ఆనకట్టు మరమ్మతులకు గురికావడంతో పైనుంచి వచ్చిన నీరు వచ్చినట్లే కిందకు పోతోంది. దీంతో ఖరీఫ్ సాగులో పూర్తి స్థాయిలో సాగునీరు అందకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పంట కాలువల్లో తుప్పలు, పూడిక పేరుకుపోవడంతో పొలాలకు సాగునీరు అందడం లేదు. సాగునీటి చెరువుల్లో తుప్పలను తొలగించని పరిస్థితి ఉంది. అధికారులు ఏటా ప్రతిపాదనలు ... మిగతా 8వ పేజీలో



శిథిలావస్థకు చేరిన ధారగెడ్డ మొదటి ఆనకట్ట

సాగునీరు అందక ఇబ్బందులు



సాగునీటి వనరులకు మరమ్మతులు చేపట్టకపోవడంతో ఏటా సాగునీరు అందక వరిసాగు చేపట్టి తీవ్రంగా నష్టపోతున్నాం. ఐదేళ్లుగా చెక్‌డ్యామ్‌లు శిథిలావస్థకు చేరినా పాలకులు, అధికారులు పట్టించుకోలేదు. ఈ ఏడాదైనా కనీసం చెక్‌డ్యామ్‌లకు మరమ్మతులు చేపట్టాలి.

- గాదె అప్పలనాయుడు, జోగంపేట, గొలుగొండ మండలం

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు


చోడవరం, ఏప్రిల్ 10: జిల్లాలో సచివాలయ వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. చోడవరం మండలంలోని లక్ష్మీపురం పంచాయతీలో 15 మంది వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎండీవోకు రాజీనామా పత్రాలు అందజేశారు.

మండలంలో 47 మంది..

అచ్యుతాపురం: మండలంలో బుధవారం 47 మంది వలంటీర్లు రాజీనామా చేశారని ఎంపీడీవో సురేశ్‌కుమార్ తెలిపారు. ఇరువాడ సచివాలయం పరిధిలో ఆరుగురు, ఉప్పవరంలో 13, దిబ్బపాలెం-2లో నలుగురు, పెదపాడులో 14 మంది ... మిగతా 8వ పేజీలో

మే 10న అప్పన్న చందనోత్సవం

- తెల్లవారుజామున 3.30 నుంచి 4.30 వరకు మాత్రమే అంతరాలయ దర్శనాలు
- ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున రాజకీయపరమైన ప్రొటోకాల్ ఉండదు
- రూ.1500, రూ.1000, రూ.300 టికెట్లు అమ్మకం



- 7లో

మసీదులకు రంజాన్ శోభ



రంజాన్ పర్వదినాన్ని గురువారం జరుపుకోనున్న నేపథ్యంలో జిల్లాలోని మసీదులు విద్యుద్దీపాలంకరణలతో కొత్త శోభను సంతరించుకున్నాయి. విశాఖలోని ఓ మసీదు ఇలా విద్యుత్ కాంతులతో దేదీప్యమానంగా కనిపించింది.

మట్టిని మింగే ఘనులు

- యథేచ్ఛగా ప్రభుత్వ భూములు, చెరువుల్లో తవ్వకాలు
- ప్రైవేటు లేఅవుట్లకు తరలిస్తున్నా, పట్టించుకోని అధికారులు

మాకవరపాలెం, ఏప్రిల్ 10:

మండలంలో మట్టి అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. అక్రమార్కులు ప్రభుత్వ భూములు, ఏపీఐఐసీ భూములు, చెరువుల్లో దర్జాగా తవ్వకాలు జరుపుతున్నారు. రేయింబవళ్లు తవ్వకాలు జరుగుతున్నా రెవెన్యూ, గనులశాఖ అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నా రు. మండలంలోని పైడిపాల గ్రామ శివారులో ఉన్న ప్రభుత్వ భూముల్లో రాత్రి వేళ మట్టి తవ్వకాలు జరిపి లారీలు, ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ఆ మట్టిని ... మిగతా 8వ పేజీలో



పైడిపాల ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలు జరపడంతో ఇలా..

క్రైం... crime news

బావిలో పడి వ్యక్తి మృతి

రోలుగుంట, ఏప్రిల్ 10: రోలుగుంట గ్రామ శివారున బావిలో పడి నిండుగొండ గ్రామానికి చెందిన ఆవుగడ్డి మల్లేశ్వరరావు (43) మృతి చెందాడు. ఎస్ఐ సురేష్ అందించిన వివరాలిలా ఉన్నాయి. నిండుగొండకు చెందిన మల్లేశ్వరరావు రోలుగుంటలోని ఉంటున్న తన అత్తవారు ఇంటికి మంగళవారం వచ్చాడు. వారి పొలాలు చూడడానికి వెళ్లి తిరిగి రాలేదు. భార్య, బంధువులు పలుచోట్ల వెతికినా ఆచూకీ తెలియరాలేదు. బుధవారం మధ్యాహ్నం అల్లూరి బావిలో ఆయన మృతదేహం కనిపించింది. విషయం తెలిసిన అతని తల్లి కేశమ్మ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీసీసీ ఉపాధ్యక్షుడు ఆత్మహత్యాయత్నం

» పార్టీ టిక్కెట్ రాలేదని మనస్తాపం..

నర్సీపట్నం, ఏప్రిల్ 10: నర్సీపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేద్దామని ఆశించి అవకాశం రాకపోవడంతో మనస్తాపం చెందిన డీసీసీ ఉపాధ్యక్షుడు కన్నూరి సత్యనారాయణ విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గొలుగొండ మండలం రాజుపేటకు చెందిన సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ నర్సీపట్నం నియోజవర్గం నుంచి పోటీ చేయడానికి గత నెల దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఎరకన్నపాలెం గ్రామానికి చెందిన రుత్తల శ్రీరామమూర్తి పేరును అధిష్ఠానం ఖరారు చేసింది. ఈ విషయం తెలుసుకున్న సత్యనారాయణ స్వగ్రామం రాజుపేటలో బుధవారం విషయం తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. స్థానికులు హుటాహుటిన ఏరియా ఆస్పత్రికి తరలించారని పార్టీ మండల అధ్యక్షుడు కె.చినబాబు తెలిపారు. ప్రస్తుతం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు.

ఆరుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 10: బంగారుమెట్ట శివారులో పైకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. వారి నుంచి రూ.16,600 నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

చోడవరంలో ఎనిమిది మంది...

చోడవరం, ఏప్రిల్ 10: మండల కేంద్రంలోని బంగారమ్మపాలెంలో బుధవారం పేకాట శిబిరంపై దాడి చేసినట్టు సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేశామన్నారు. వారి నుంచి రూ.18,170 నగదు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ చెప్పారు.

అక్రమ మద్యం కేసులో మరో నలుగురు...

మునగపాక (తుమ్మపాల), ఏప్రిల్ 10: మునగపాకలో ఈ నెల 6న అక్రమ మద్యం తరలించి కేసులో నలుగురు వ్యక్తులను అరెస్టు చేయగా, అదే కేసులో సంబంధం ఉన్న మరో నలుగురు వ్యక్తులను బుధవారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. పిళ్లా నాగసాయి, కోనాల వెంకట సత్యనారాయణరెడ్డి, ఇ.మోహన్, ఎం.రాజులను అరెస్టు చేసినట్టు చెప్పారు. ఇప్పటివరకు ఈ కేసుకు సంబంధించి ఎనిమిది మందిని అరెస్టు చేశామని ఎస్ఐ వివరించారు.

11 మద్యం సీసాలు స్వాధీనం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 10: ఒక వ్యక్తి నుంచి 11 మద్యం సీసాలను బుధవారం స్వాధీనం చేసుకున్నామని పట్టణ హెడ్ కానిస్టేబుల్ బి.రామకృష్ణ తెలిపారు. కశింకోట మండలంలోని వెదురుపర్తి గ్రామానికి చెందిన కొణతాల రోహిత్ మద్యం కొనుగోలు చేసి స్వగ్రామానికి వెళ్తుండగా శారదానగర్‌లో పట్టుకున్నామన్నారు. అతనిపై కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ చెప్పారు.

ఆర్టీసీ బస్సులో గంజాయి రవాణా

» 14 కిలోలు స్వాధీనం, భార్యాభర్తలు అరెస్టు

విశాఖపట్నం, ఏప్రిల్ 10: అగనంపూడి టోల్‌గేటు వద్ద ఆర్టీసీ బస్సులో గంజాయి రవాణా చేస్తున్న భార్యాభర్తలను దువ్వాడ పోలీసులు అదుపులోకి తీసుకుని 14 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. బెంగళూరులో నివాసముంటున్న భార్యాభర్తలు నాగరాజు, భారతి దంపతులు కుక్కలను విక్రయిస్తూ ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న వారికి చంద్రప్ప అనే వ్యక్తి పరిచయమయ్యాడు. వీరి ఆర్థిక పరిస్థితి గురించి తెలుసుకున్న చంద్రప్ప మీరు ఉమ్మడి విశాఖ జిల్లాలోని నర్సీపట్నానికి వెళితే ఓ వ్యక్తి గంజాయి ఇస్తాడని, దానిని తెచ్చి తనకు అప్పగిస్తే పెద్ద మొత్తంలో నగదు ఇస్తానని ఆశ చూపాడు. రవాణా చార్జీలను కూడా తానే భరిస్తాననీ చెప్పడంతో ఆ దంపతులిద్దరూ ఈ నెల ఎనిమిదిన బెంగళూరు నుంచి రైలులో తుని చేరుకుని, అక్కడ నుంచి బస్సులో నర్సీపట్నం వెళ్లి బస్టాండ్‌లోనే బస చేశారు. బుధవారం ఉదయం ఓ వ్యక్తి వచ్చి గంజాయి బ్యాగులను వారికి అందజేశాడు. ఈ క్రమంలో వారికి చంద్రప్ప ఫోన్ చేసి నర్సీపట్నం నుంచి విశాఖ రైల్వే స్టేషన్‌కు వచ్చి ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో బెంగళూరు రావాలని సూచించాడు. దీంతో వారు రెండు కిలోల చొప్పున ఏడు ప్యాకెట్లలో ఉన్న 14 కేజీల గంజాయితో నర్సీపట్నం నుంచి విశాఖకు ఆర్టీసీ బస్సులో బయలుదేరారు. ఎన్నికల నేపథ్యంలో అగనంపూడి టోల్‌గేటు వద్ద అధికారులు, దువ్వాడ పోలీసులు బస్సులో తనిఖీలు నిర్వహిస్తుండగా గంజాయి పట్టుబడింది. ఈ మేరకు నాగరాజు, భారతిలను అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దంపతులిద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

భీమిలి బీచ్ రోడ్డులో ప్రమాదం

» తొట్లకొండ వద్ద ద్విచక్ర వాహనాలు ఢీ

» ఇద్దరి మృతి... మరో ఇద్దరికి గాయాలు

భీమునిపట్నం, ఏప్రిల్ 10: భీమిలి బీచ్‌రోడ్డులో తొట్లకొండ వద్ద మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరు మృతిచెందారు. ఇందుకు సంబంధించి భీమిలి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రుషికొండ ప్రాంతానికి చెందిన దొలపల్లి చినఅప్పలరాజు (25) ఏ1 గ్రాండ్ బేలో పార్టుటైమ్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. అతను మంగళవారం రాత్రి పన్నెండు గంటలు దాటిన తరువాత స్నేహితుడి వాహనం ఆగిపోయిందని స్కూటీ (ఏపీ 39 ఎస్‌పి 3781)పై భీమిలి వైపు బయలుదేరాడు. అదే సమయంలో భీమిలి వైపు నుంచి సుజుకీ యాక్సస్‌పై ముగ్గురు అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనాన్ని నడుపుతూ ఎదురుగా వస్తున్న స్కూటీని ఢీకొన్నారు.

ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చినఅప్పలరాజును వెంటనే కేజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. అలాగే, సుజుకీ వాహనం నడుపుతున్న చింతపల్లి వీరభద్ర గౌతమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచాడు. ఇదేవాహనంపై వెనుక కూర్చున్న దుర్గ, రాజు కూడా తీవ్రంగా గాయపడి అదే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరభద్ర, దుర్గ, రాజులు కూడా రుషికొండ ప్రాంతానికి చెందినవారుగా చెబుతున్నారు. కాగా, ఈ విషయమై, రుషికొండ ఎంఆర్ బాయ్స్ హాస్టల్ వద్ద నివాసం ఉంటున్న చినఅప్పలరాజు సోదరుడు, సీసీ టీవీ టెక్నీషియన్ అప్పలరాజు తమకు ఫిర్యాదు చేశారన్నారు. తన తమ్ముడైన చినఅప్పలరాజు తన స్నేహితుడు వాహనం ఆగిపోయిందని చెప్పి స్కూటీని అర్ధరాత్రి 12.25 గంటలకు తీసుకువెళ్లాడని, తర్వాత 12.50 గంటలకు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి ప్రమాదం జరిగిందని, కేజీహెచ్‌కు తీసుకువెళుతున్నామని తెలిపాడని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. పూర్తి వివరాలు అందవలసి ఉందన్నారు. కాగా, భీమిలిలో అమ్మవారి ఉత్సవాలు జరుగుతున్నాయి. పండగకు వచ్చి వెళుతున్న వాహనం ఒకటి, పండగకు వస్తున్న వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. చేపల తిమ్మాపురం వద్ద వంతెన మరమ్మతులు జరుగుతున్నందున ఒకవైపు రహదారిని మూసివేసి, తొట్లకొండ వరకూ రహదారిని వన్‌వేగా మార్పు చేయడంతో ఆ ప్రదేశంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయంలో పోలీసు అధికారులు మరిన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	405
విజయనగరం	409
శ్రీకాకుళం	409

నేడే ఈదుల్ ఫిత్ర్



ముగిసిన ఉపవాస దీక్షలు

» ముస్లింల పవిత్ర పండుగ

గోపాలపట్నం, ఏప్రిల్ 10: దేశంలో పలు ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం చంద్రుడు దర్శనమివ్వడంతో దేశవ్యాప్తంగా ఉన్న ముస్లింలు గురువారం రంజాన్ పం డుగను జరుపుకో నున్నారు. ఇస్లాం ధర్మాన్ని పాటించే ప్రపంచంలో ఏ దేశానికి చెందిన ముస్లింలైనా ఏడాదిలో జరుపుకునేవి రెండే పండుగలు. మొదటిది ఈదుల్ ఫిత్ర్. రెండోది ఈదుల్ అజ్‌హా లేదా బక్రీద్ పండుగ. రంజాన్ మాసంలో నెల రోజుల పాటు కఠోరమైన ఉపావాస దీక్షలు పూర్తి చేశాక నెలవంకను చూసిన తర్వాత జరుపుకునే పండుగే ఈదుల్ ఫిత్ర్. రంజాన్ అనేది ఇస్లామిక్ క్యాలెండర్‌లో వచ్చే తొమ్మిదో నెల పేరు. అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (సఅస)పై అవతరించిన దైవదత్త గ్రంథం ఖురాన్ ఈ నెలలోనే భూమండలంపైకి అవతరించిందని ఖురాన్‌లో పేర్కొనబడింది. ఈ నెలలో మొదటి నెలవంకను చూసిన తర్వాత రోజు నుంచి ఉపవాసాలు ప్రారంభమతాయి. నెలవంకను చూసిన రోజు రాత్రి నుంచి మళ్లీ నెలాఖరులో నెలవంకను చూసేంత వరకు ప్రతిరోజు రాత్రి ప్రత్యేక నమాజులు చేస్తూ.. పగటి పూట ఉపవాసాలు ఆచరించడం ఇస్లాం ధర్మంలోని ఓ ముఖ్యమైన విధి. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు పూర్తి చేశాక నెలాఖరులో దర్శనమిచ్చే నెలవంకను చూసిన మరుసటి రోజు రంజాన్ ఈద్ అంటే ఈదుల్ ఫిత్ర్ పండుగను జరుపుకుంటారు.

ఈదుల్ ఫిత్ర్ అంటే..

రంజాన్ అనేది పండుగ పేరు కాదు. ఇది ఒక నెల పేరు మాత్రమే. ఈ నెలలో జరుపుకునే పండగే ఈదుల్ ఫిత్ర్. ఈద్ అంటే అరబి భాషలో పండుగ అని అర్థం. ఫిత్ర్ అంటే రంజాన్ నెలలో చేసే దానం. ప్రతి ముస్లిం తమ కుటుంబ సభ్యులు, తల్లి గర్భంలో ఉన్న బిడ్డతో సహా అందరి పేరున రంజాన్ ఈద్ నమాజ్‌కు వెళ్లే ముందు ఒక్కొక్కరి పేరిట రెండున్నర కిలోల గోధుమలు లేదా కిస్మిస్ లేదా ఖర్జూరం లేదా వాటికి సమానమైన విలువ కలిగిన నగదును పేదలకు దానం చేయాలి. ఇలా దానం చెల్లించడాన్నే ఫిత్రా అంటారు. ఫిత్రా చెల్లించే ఈ పండుగనే ఈదుల్ ఫిత్ర్ అంటారు.

నమాజ్‌కు ముందు ఫిత్రా చెల్లిండం తప్పనిసరి

రంజాన్ పండుగలో ముఖ్యమైన ఘట్టం ఈద్ నమాజ్ ఆచరించడం. మసీదులతో పాటు పండుగ రోజు నమాజ్ ఆచరించే ప్రత్యేక ప్రార్థనా స్థలాలైన ఈద్‌గాహ్‌లలో పండుగ నమాజ్‌ను ఆచరిస్తారు. ఈద్ రోజు సూర్యోదయం జరిగిన తర్వాత నుంచి ఉదయం 11 గంటల వరకు ఈద్ నమాజ్ ఆచరించవచ్చు.

అయితే నమాజ్‌కు వెళ్లే ముందే ఫిత్రా దానం చెల్లించడం ప్రవక్త ముహమ్మద్ (సఅస) ఆనవాయితీ. నమాజ్ ముగిశాక ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటారు.

జకాత్ దానం కూడా చెల్లించాలి

జకాత్ దానం అనేది ఇస్లామ్ ధర్మంలో ఆదాయ పన్నుగా చెప్పవచ్చు. సమాజంలో పేదరికాన్ని రూపుమాపడానికి ధనికులపై పేదలకు గల ఈ హక్కునే జకాత్ అంటారు. అంటే.. ఏడాది అంతా ఒక వ్యక్తి తన సంపాదన మొత్తంలో కుటుంబ ఖర్చులు, అప్పులు పోనూ తన వద్ద గల ధనం, వెండి, బంగారం, పశువులు, ఆహార ధాన్యాలపై జకాత్ చెల్లించాలి. తన సంపదపై నూటికి రూ.2.50 చొప్పున జకాత్ చెల్లించాలి. ఈ జకాత్ సొమ్మును కేవలం పేదలకు మాత్రమే అందించాలి. జకాత్ సొమ్మును మసీదుల నిర్మాణం కోసం విరాళంగా ఇవ్వడం నిషేధం.

ఇదీ రంజాన్ సారాంశం..

రంజాన్ నెలలో ఆచరించే ఉపవాసాలు వెనక మహా పరమార్థం దాగి ఉంది. ఉపవాసం చేసి శరీరాన్ని పస్తులతో బలహీనపర్చడం ముఖ్యోద్దేశం కాదు. ఉపవాస దీక్షలో దైవప్రీతి కోసం ఉపవాస దీక్షలు ఆచరించే సమయంలో ఏ విధంగా సమస్త చెడు కార్యాలకు దూరంగా ఉంటామో ఏడాదిలోని మిగిలిన 11 నెలలు కూడా రంజాన్ స్ఫూర్తితో సన్మార్గంలో ఉండేందుకు ఈ ఉపవాసాలు దోహదపడతాయి. ఆకలిగా ఉన్నవారి ఆకలిని తీర్చడం జకాత్ దానం ద్వారా పేదరికం నిర్మూలించడం, రంజాన్ ఆచరణలతో సన్మార్గానికి బాట వేయడం ప్రవక్త ముహమ్మద్ (సఅస) బోధించిన మార్గం.

డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అచ్యుతాపురం, ఏప్రిల్ 10: సెజ్‌లోని ఎంఎస్ఎంఈలో ఏఐసీటీఈ ఆమోదించిన డిప్లొమా ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశ పరీక్ష కోసం వచ్చే నెల 2వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సంస్థ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగేళ్ల డిప్లొమా ఇన్ అడ్వాన్స్‌డ్ డై, మౌల్డ్ మేకింగ్, మూడేళ్ల డిప్లొమా ఇన్ అడ్వాన్స్‌డ్ మెకాట్రానిక్స్ ఇండస్ట్రియల్ ఆటోమేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు దరకాస్తులు ఆహ్వానిస్తున్నామని చెప్పారు. ఒక్కో కోర్సులో 60 మందిని ఎంపిక చేస్తామన్నారు. జూలై ఒకటి 2024 నాటికి 19 ఏళ్లు నిండి 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొందిన పదో తరగతి విద్యార్థులు ఇందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఎస్‌సి, ఎస్‌టీ, ఓబీసీ అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనలు వర్తిస్తాయని చెప్పారు. పరీక్షలు ఏయూ క్యాంపస్ విశాఖపట్నం, ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ అచ్యుతాపురం, అనకాపల్లి, విజయవాడల్లో జరుగుతాయన్నారు. వచ్చే నెల 5న రాత పరీక్ష, 10న ఫలితాల ప్రకటన, జూన్ 3న అడ్మిషన్ల కోసం కౌన్సెలింగ్ ప్రక్రియ, జూన్ 17వ తేదీ నుంచి తరగతులు ప్రారంభిస్తారని వారు తెలిపారు.

డబుల్ ఎంట్రీ ఓట్లను తొలగించాలి

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు

అనకాపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలో అనకాపల్లి నియోజకవర్గం పరిధిలోని డబుల్ ఎంట్రీ ఓట్లను తొలగించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు కలెక్టరును కోరారు. బుధవారం వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమావేశం అనంతరం కలెక్టర్‌ను కలిసిన డబుల్ ఎంట్రీ ఓటర్ల వివరాలను ఆయన తెలిపారు. అనకాపల్లి నియోజకవర్గంలో సుమారు 4,828 ఓట్లు, సింగిల్ డోర్ నంబర్ ఓట్లు 5,278, డోర్ నంబర్లు లేకుండా 666 ఓట్లు ఉన్నట్టు తమ పార్టీ నాయకులు గుర్తించారని చెప్పారు. ఆయా పోలింగ్ బూత్‌ల పరిధిలోని ఓటర్ల జాబితాల్లో ఉన్న ఈ ఓట్లను తొలగించాలని కోరారు.

రాష్ట్రంలో కూటమి ప్రభంజనం తథ్యం

» ముద్దుర్తి సభలో బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్

చోడవరం, ఏప్రిల్ 10: రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి విజయం తథ్యమని అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సీఎం రమేశ్ ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని ముద్దుర్తి పంచాయతీలో చోడవరం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన పలువురు సర్పంచులు, పార్టీ నాయకులు బుధవారం రాత్రి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం రమేష్ మాట్లాడుతూ తనను గెలిపిస్తే అనకాపల్లి పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో అభివృద్ధి ఏ విధంగా ఉంటుందో చేసి చూపిస్తామన్నారు. రాష్ట్రం బాగుపడాలంటే టీడీపీ అధినేత చంద్రబాబు సారథ్యం అవసరమన్నారు. మోదీ, చంద్రబాబు, పవన్ సహకారంతో రాష్ట్రం అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బత్తుల తాతయ్యబాబు, గూనూరు మల్లునాయుడు, గేదెల సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ గంగాధర్ పాల్గొన్నారు.



ముద్దుర్తి సభలో మాట్లాడుతున్న సీఎం రమేష్

వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు

అంతకు ముందు వెంకన్నపాలెం నుంచి ముద్దుర్తి వరకు టీడీపీ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబేరుపురం, నరసాపురం, ముద్దుర్తి, చోడవరంతదితర పంచాయతీలకు చెందిన అధికార పార్టీకి చెందిన నాయకులు పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

సామాజిక భవన స్థలంపై వివాదం

» అప్పలమ్మపాలెంలో వీఆర్వోను నిర్బంధించిన గ్రామస్థులు





వివాదాస్పద స్థలంపై విచారిస్తున్న ఆర్ఐ... కబ్జా స్థలంలో అరటి చెట్లను తొలగించిన మహిళలు

రావికమతం, ఏప్రిల్ 10: మండలంలోని మేడివాడ పంచాయతీ శివారు అప్పలమ్మపాలెంలో కాలనీలో కమ్యూనిటీ హాలుకు చెందిన స్థలంపై వివాదం నెలకొంది. ఇందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్థులు వీఆర్వోను నిర్బంధించారు. ఈ ఘటనలకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. కాలనీలో సామాజిక భవనానికి చెందిన ఆరు సెంట్ల స్థలాన్ని ఆన్‌లైన్‌లో జిరాయితీగా వేరొకరి పేరున మార్పు జరిగింది. ఈ స్థితిలో ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 8వ తేదీన అప్పలమ్మపాలెం గ్రామస్థులు తహసీల్దార్ రమణారావుకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆర్ఐ సతీశ్‌ను విచారణ చేపట్టి నివేదికను సమర్పించాలని ఆదేశించారు. ఈ మేరకు బుధవారం వీఆర్వో నారాయణరావుతో కలిసి ఆర్ఐ సతీశ్ గ్రామంలో బహిరంగ విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన మడక సత్యారావు కమ్యూనిటీ హాలుకు కేటాయించిన స్థలాన్ని ఆక్రమించి, రెవెన్యూ అధికారుల సహకారంతో ఆయన పేరున రికార్డులు చేయించుకుని తన అల్లుడు పేరిట ఈ స్థలాన్ని చోడవరం రిజిస్టర్ కార్యలయంలో గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఈ సందర్భంగా గ్రామస్థులు ఆర్ఐని నిలదీశారు. ఈ విధంగా హక్కు పొందిన స్థలంలో అరటి తోట పెంచారని మహిళలు వివరించారు. సత్యారావు కబ్జా చేసిన స్థలాన్ని కాలనీ అవసరాలకు వినియోగించాలని డిమాండ్ చేశారు. అక్రమ రిజిస్ట్రేషన్‌కు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను అంగీకరించకుంటే వీఆర్వో నారాయణరావును గ్రామం దాటనిచ్చేదిలేదని అతన్ని నిర్బంధించారు. కమ్యూనిటీ హాలుకు చెందినదంటున్న స్థలంపై సర్వే చేపట్టేవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేమని గ్రామస్థులకు ఆర్ఐ సర్దిచెప్పారు. ఒకానొక దశలో ఈ స్థలం కబ్జాకు వీఆర్వో కారణమంటూ గ్రామస్థులు ఆందోళనకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. తొందరపాటు తగదని, వాస్తవం తేలేవరకు ఓపిక పట్టాలని ఆర్ఐ కోరడంతో గ్రామస్థులు శాంతించారు. విచారణ వాయిదా వేసి అధికారులు వెనుదిరిగారు.

మే 10న సింహాచలం అప్పన్న చందనోత్సవం

» తెల్లవారుజామున 3.30 నుంచి 4.30 వరకు అంతరాలయ దర్శనం

» సమీక్ష సమావేశంలో కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున

విశాఖపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని వరాహలక్ష్మీనృసింహస్వామి చందనోత్సవం మే పదో తేదీన జరగనున్నదని కలెక్టర్ డాక్టరు ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో చందనోత్సవ ఏర్పాట్లుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవానికి ఏర్పాట్లు పక్కాగా చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి స్లాట్ల ప్రకారం దర్శనాలకు అనుమతి, ఇతర కార్యకలాపాలు చేపట్టాలన్నారు. పదోతేదీ తెల్లవారుజామున 3.30 నుంచి 4.30 గంటల వరకు (గంటపాటు) మాత్రమే అనువంశిక ధర్మకర్త, టీటీడీ నుంచి పట్టు వస్త్రాలు సమర్పించే వారు, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, దాతలకు అంతరాలయ ప్రవేశం ఉంటుందన్నారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున రాజకీయ ప్రొటోకాల్ ఉండదని స్పష్టంచేశారు. చందనోత్సవం విజయవంతం కోసం అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. స్వామి దర్శనం టికెట్లను నగరంలోని ఏడు నుంచి పది బ్యాంకుల్లో కౌంటర్లు ద్వారా విక్రయిస్తామన్నారు. వచ్చేనెల ఆరోతేదీలోగా టికెట్ల విక్రయాలు పూర్తిచేయాలని దేవదాయశాఖ అధికారులను ఆదేశించారు. దర్శనం కోసం రూ.1500, రూ.1000, రూ.300 ధరలతో టికెట్ల జారీ ప్రక్రియను ప్రణాళికాయుతంగా చేపట్టాలన్నారు. టికెట్లపై హోలోగ్రామ్, వాటర్‌మార్కు వచ్చేలా రూపొందించాలన్నారు. రూ.1500 టిక్కెట్ కొనుగోలుచేసిన వారికి మాత్రమే నీలాద్రిగుమ్మం నుంచి దర్శనానికి అనుమతిస్తామన్నారు. తెల్లవారుజామున 4.30 గంటల తరువాత వచ్చిన వారిని అంతరాలయంలోకి అనుమతించ మన్నారు. గత అనుభవాలను పరిగణనలో తీసుకుని కొండపైకి వాహన రాకపోకలను గణనీయంగా తగ్గించాలని, దీనికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. హనుమంతు వాక నుంచి పాత గోశాల వరకు, అక్కడి నుంచి అడవివరం వరకు, రెండు పార్కింగ్‌జోన్‌లు ఏర్పాటుచేయాలని, అవసరం మేరకు హనుమంతువాక మార్గంవైపు తొమ్మిది, అడవివరం వైపు 12 పార్కింగ్ స్థలాలను గుర్తించాలన్నారు.

కొండ దిగువ నుంచి పైకి తరలించడానికి, దర్శనం అయిన తరువాత కిందకు తీసుకువెళ్లేందు బస్సులు ఏర్పాటుచేయాలని రవాణా, దేవదాయ శాఖ అధికారులను ఆదేశించారు. క్యూలైన్లలో విరివిగా తాగునీరు, మజ్జిగ కేంద్రాలు, గతంలో కంటే రెట్టింపుసంఖ్యలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. మరుగుదొడ్లు, ఇతర వసతులు సమ కూర్చాలని, విభిన్న ప్రతిభావంతులకు ఆ రోజు సాయంత్రం నాలుగు నుంచి ఐదుగంటల వరకు దర్శనానికి స్లాట్లు ఇవ్వాలని సూచించారు. వాహన రద్దీని తగ్గిస్తున్న నేపథ్యంలో పాసులు జారీచేయాలని, ప్రైవేటు వాహనాలను కొండపైకి అనుమతించవద్దన్నారు. సమావేశంలో పోలీస్ కమిషనర్ డాక్టరు రవిశంకర్ అయ్యన్నార్, జేసీ మయూర్‌అశోక్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంతవర్మ, అడిషినల్ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, దేవదాయ శాఖ అదనపు కమిషనర్ కె.రామచంద్రమోహన్, డీఆర్వో మోహన్‌కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

18 నుంచి అప్పన్న వార్షిక తిరుకల్యాణోత్సవాలు

అనూచానంగా వస్తున్న ఆచారం ప్రకారం ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం సింహాచల వరాహలక్ష్మీనృసింహస్వామికి చైత్రమాస శుక్లపక్ష దశమి నుంచి అనగా ఈనెల 18 నుంచి సంప్రదాయబద్ధంగా నిర్వహించనున్న వార్షిక తిరుకల్యాణ మహోత్సవానికి ఆహ్వాన పత్రికలు సిద్ధమయ్యాయి. చైత్రమాస శుక్లపక్ష దశమి అనగా ఈనెల 18న రాత్రి 7 గంటలకు సర్వదర్శనాలు నిలిపివేసిన తరువాత విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచనము, రుత్విగ్వరణము, ఉత్సవాంగీకారము, మృత్సంగ్రహణము, అంకురార్పణము జరుగుతాయి. 19న వేకువజామున సుప్రభాత సేవ, విశేష హోమాలు, బలిహరణము, మధ్యాహ్నం 3 గంటలకు కల్యాణ వేడుకకు ప్రారంభ సూచకంగా పసుపు (కొట్నాలు) దంచే ఉత్సవం, సాయంత్రం 4 గంటల నుంచి 6.30గంటల వరకు విశేష హోమాలు, గ్రామబలిహరణము, ధ్వజారోహణము, రాత్రి 6.30 నుంచి 7.30గంటల వరకు ఎదురు సన్నాహోత్సవం, స్వర్ణ తొళక్కినియాన్‌పై తిరువీధి సేవ, ముత్యాల పల్లకిలో అమ్మవార్ల సేవ, అనంతరం రథంపై స్వామివారి వేంచేపు, రాత్రి 8.15 గంటలకు సింహగిరి మాడవీధుల్లో రథోత్సవం, రాత్రి 8.30 నుంచి 10గంటల వరకు భక్తులకు దర్శనాలు, రాత్రి 10.30 గంటల నుంచి తిరుకల్యాణ మహోత్సవం ప్రారంభమవుతాయి. ఈనెల 20న సాయంత్రం 5 గంటలకు పెద్ద శేష వాహనంపై మాడవీధుల్లో స్వామివారి తిరువీధి సేవ, ఈనెల 21న ఉదయం 7.30 గంటలకు వైదిక సదస్యము, మధ్యాహ్నం 3.30 గంటలు పండిత సదస్యం, ఆరు గంటలకు సర్వజన మనోరంజని వాహనంపై తిరువీధి సేవ, ఈనెల 22న సాయంత్రం 5 గంటలకు సూర్యప్రభ వాహనంపై తిరువీధి సేవ, ఈనెల 23న 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు పూర్ణాహుతి, చూర్ణోత్సవం, అవబృధోత్సవం (చక్రవారి), రాత్రి 7 గంటల నుంచి 11గంటల వరకు మృగయోత్సవం (దొంగల దోపు ఉత్సవం), అశ్వవాహనంపై తిరువీధి సేవ, సంవాద సేవ, 24న ఉదయం 8 గంటల నుంచి వినోదోత్సవం (ఉంగరపు సేవ), ముత్యాల పల్లకిసేవ, మధ్యాహ్నం 11.30 గంటల నుంచి మహా సంప్రోక్షణ, సాయంత్రం ఆరు గంటలకు శ్రీపుష్పయాగము, ద్వాదశారాధనలు, సప్తావరణ, దర్పణసేవ, ఉయ్యాల సేవ, పవళింపు, ఏకాంత సేవలతో కల్యాణోత్సవాలు పరిసమాప్తమవుతాయి.

పలు రైళ్లు రద్దు...రీ షెడ్యూల్...దారి మళ్లింపు

విశాఖపట్నం, ఏప్రిల్ 10: సంబల్‌పూర్ డివిజన్‌లో నాన్ ఇంటర్ లాకింగ్ నిర్మాణ పనులు చేపడుతున్న నేపథ్యంలో పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు, రీ షెడ్యూల్ చేయగా, మరికొన్ని రైళ్లను మళ్లింపు మార్గంలో నడిపించనున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. ఈనెల 15 నుంచి 24 వరకు విశాఖ- రాయపూర్ పాసింజర్ (08527), రాయపూర్-విశాఖ పాసింజర్ (08528), విశాఖ-భవానీపట్న పాసింజర్ (08504), సంబల్‌పూర్-రాయగడ ఎక్స్‌ప్రెస్ 18301), రాయగడ- సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (18302) రద్దు కాగా, ఈనెల 16 నుంచి 25 వరకు భవానీపట్న- విశాఖ పాసింజర్ (08505) రద్దు చేసినట్టు ప్రకటించారు. విశాఖ-భగత్‌కి కోఠి ఎక్స్‌ప్రెస్ (18573) ఈనెల 18న నిర్ణీత సమయం కన్నా రెండు గంటల 30 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరేలా రీ షెడ్యూల్ చేశారు. విశాఖ-బనారస్ ఎక్స్‌ప్రెస్ (18311) ఈనెల 21న వయా విజయనగరం, కుర్దారోడ్డు, అంగు ల్, సంబల్‌పూర్ సిటీ, జార్సుగూడ మీదుగా తిరుగు ప్రయాణంలో బనారస్ - విశాఖ ఎక్స్‌ప్రెస్ (18312) ఈనెల 22న వయా జార్సుగూడ, సంబల్‌పూర్ సిటీ, అంగుల్, కుర్దారోడ్డు, విజయనగరం మీదుగా నడుస్తాయి. అలాగే, ఈనెల 15, 24న టాటా-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ (18189) వయా జరోలి, జఖపూరా, కటక్, కుర్దారోడ్డు, విజయనగరం మీదుగా....తిరుగు ప్రయాణంలో ఎ ర్నాకులం-టాటా ఎక్స్‌ప్రెస్ (18190) ఈనెల 14, 23న వయా విజయనగరం, కుర్దారోడ్డు, కటక్, జఖపూరా, జరోలి మీదుగా నడుస్తాయి.

దువ్వాడ మీదుగా వేసవి ప్రత్యేక వారాంతపు రైళ్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 10: వేసవి ప్రయాణికుల సౌకర్యార్థం వయా దువ్వాడ మీదుగా సికింద్రాబాద్-సంత్రాగచ్చి, సికింద్రాబాద్-షాలిమార్ మధ్య ప్రత్యేక వారాంతపు రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు.

సికింద్రాబాద్-సంత్రాగచ్చి-సికింద్రాబాద్

07223 నంబరు గల రైలు ఈనెల 19 నుంచి జూన్ 28 వరకు ప్రతి శుక్రవారం ఉదయం 7.05 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి రాత్రి 7.55 గంటలకు దువ్వాడ, మర్నాడు ఉదయం 10.30 గంటలకు సంత్రాగచ్చి చేరుతుంది. తిరిగి ఈనెల 20 నుంచి జూన్ 29 వరకు ప్రతి శనివారం మధ్యాహ్నం 12.20 గంటలకు సంత్రాగచ్చిలో బయలుదేరి మర్నాడు తెల్లవారుజాము 2.03 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 2.45 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది.

సికింద్రాబాద్-షాలిమార్-సికింద్రాబాద్..

07225 నంబరు గల రైలు ఈనెల 15 నుంచి జూన్ 24 వరకు ప్రతి సోమవారం ఉదయం 4.30 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మధ్యాహ్నం 2.30 గంటలకు దువ్వాడ, మర్నాడు ఉదయం 6.05 గంటలకు షాలిమార్ చేరుతుంది. తిరిగి ఈనెల 16 నుంచి జూన్ 25 వరకు ప్రతి మంగళవారం ఉదయం 10.00 గంటలకు షాలిమార్‌లో బయలుదేరి మర్నాడు తెల్లవారుజాము 1.25 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 1.00 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది.

590 మందిపై బైండోవర్ కేసులు: సీఐ

సబ్బవరం, ఏప్రిల్ 10: మండలంలోని పలు గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న 590 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో వైసీపీ, జనసేన, టీడీపీకి చెందిన సుమారు 500 మంది, మరో 40 మంది రౌడీలపై ఈ కేసులు నమోదు చేసామన్నారు. పినగాడి-కె.కోటపాడు రోడ్డులో గుల్లేపల్లి వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసి 24 గంటలూ తనిఖీలు చేపడుతున్నామని చెప్పారు. మండలంలోని 68 పోలింగ్ స్టేషన్లను పరిశీలించి అవసరమైన సదుపాయలు కల్పించామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అనుసరించాల్సిన చర్యలను ఆయన వివరించారు.

కడియంవారివీధిలో పూరిల్లు దగ్ధం

» దూరపు బంధువు నిప్పుపెట్టినట్టు బాధితుల ఆరోపణ

» పోలీసు కేసు నమోదు... ఒకరి అరెస్టు

పాయకరావుపేట, ఏప్రిల్ 10: మండల కేంద్రంలోని కడియంవారివీధిలో బుధవారం పూరిల్లు దగ్ధమైంది. ఈ ఘటనకు దూరపు కారణమని బాధితులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. కడియంవారివీధిలో పాత పంచాయతీ కార్యాలయం వెనుక లోకవరపు లక్ష్మి పూరిపాక నిర్మించుకుని ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నారు. మూడు నెలల క్రితం లక్ష్మి దూరపు బంధువు లావేటి సంజీవ్ వచ్చి తన స్నేహితుడు బెంజిమెన్‌కు ఇంటిలో సమస్యలు ఉన్నందున కొద్ది రోజులు ఆశ్రయం ఇవ్వాలని కోరాడు. దీంతో లక్ష్మి తన ఇంటి వరండాలో పడుకునేందుకు అంగీకరించింది. ఈ క్రమంలో బెంజిమెన్ వారం రోజులుగా రోజూ మద్యం తాగి వస్తుండడంతో లక్ష్మి బయటకు పొమ్మని చెప్పింది. దీంతో బెంజిమెన్ బుధవారం తెల్లవారుజామున వచ్చి పూరింటికి నిప్పు పెట్టాడని, దీన్ని గుర్తించిన తన పిల్లలు కేకలు వేయడంతో పారిపోయాడని బాధితురాలు లక్ష్మి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, నిందితుడు బెంజిమెన్‌ను పట్టుకుని రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.


దుప్పితూరులో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ఘనంగా భావనారుషి కల్యాణం


రాంబిల్లి : కొత్తపేటలో కొలువుదీరిన స్వామి

అచ్యుతాపురం/రాంబిల్లి, ఏప్రిల్ 10 : పద్మశాలీల ఆరాధ్య దైవం భద్రావతీ సమేత భావనారుషి స్వామి కల్యాణం మండలంలోని దుప్పితూరులో కన్నుల పండువగా నిర్వహించారు. తొలుత మంగళవారం రాత్రి స్వామికి పత్రి పూజ జరిపారు. బుధవారం ఉదయం నుంచి సహస్ర నామార్చన, ప్రత్యేక కుంకుమార్చనలు చేపట్టారు. అనంతరం వైభవోపేతంగా కల్యాణాన్ని జరిపించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నసమారాధన ఏర్పాటైంది. ఈ వేడుకల్లో మాడెం సూరి అప్పారావు, ఆముదూరి అప్పలరాజు, మాడెం అప్పలరాజు, గోవిందరావు, ఎస్.రాంబాబు, ఈశ్వరరావు, నరసింగరావు, బి.తాతారావు, తమ్మిన రామలక్ష్మణ తదితరులు పాల్గొన్నారు. అలాగే, రాంబిల్లి మండలంలోని కొత్తపేటలో భావనారుషీశ్వర కల్యాణం బుధవారం కన్నుల పండువగా జరిగింది. తొలుత భద్రావతి సమేత స్వామివారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరై తిలకించారు. కొత్తపేట పద్మశాలి సంఘం ప్రతినిధులు, ఆలయ కమిటీ నిర్వాహకులు మాడెం రాజుబాబు, మాడెం నాగేశ్వరరావు, వానపల్లి వెంకట అరుణలత, జగన్నాథ్, తేలు వెంకటేశ్వరరావు, తెడ్లపు అప్పలకొండ, తేలు నర్సింహమూర్తి, పుత్సా బాబూరావునాయుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఇంటి పన్నుల చెల్లింపునకు క్యూ

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 10 : జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కార్యాలయంలో బుధవారం ఇంటిపన్ను చెల్లింపుదారులు క్యూ కట్టారు. జీవీఎంసీ ఈ ఆర్థిక సంవత్సరం మొదటి విడత వాయిదా చెల్లించిన వారికి ఐదుశాతం రాయితీ ఇవ్వడంతో పన్ను చెల్లింపుదారులు భారీగా కార్యాలయానికి చేరుకుని చెల్లించారు. పన్ను చెల్లింపుదారులు క్యూలో ఉండడానికి నీడ సౌకర్యం లేకపోవడంతో మండుటెండలో పలువురు గొడుగులు పట్టుకుని నిలబడాల్సి వచ్చింది. ఈ విషయమై జడ్పీ అయ్యప్పనాయుడు వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా స్పందించిన ఆయన షామియానా ఏర్పాటు చేయించారు.

ఆరంభంలోనే అగ్గి

- సెగలు కక్కుతున్న సూరీడు
- బెంబేలెత్తుతున్న జనం
- మధ్యాహ్నం వేళ నిర్మానుష్యంగా మారుతున్న రహదారులు
- మరో రెండు రోజులపాటు వడగాల్పుల హెచ్చరికతో ఆందోళన


మధ్యాహ్నం నిర్మానుష్యంగా దర్శనమిస్తున్న పరవాడలోని సంతబయలు


ఒంటిపూట బడులు కావడంతో కోటవురట్లలో గొడుగు నీడలో ఇంటికి వెళుతున్న విద్యార్థినులు


అనకాపల్లి పట్టణంలో జనసందడి లేని చోడవరం రహదారి

అనకాపల్లి టౌన్/కోటవురట్ల/పరవాడ, ఏప్రిల్ 10 : ఎండలు మండిపోతున్నాయి. ఇంట్లో ఉన్నా.., వీధిలోకి వెళ్లినా.. చెమటలు ఆగడం లేదు. వీటికి తోడు వడగాల్పులు మరింత ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దీంతో వేసవి ఆరంభంలోనే ఇలా ఉంటే.. మున్ముందు పరిస్థితి ఏమిటని అంతా ఆందోళన చెందుతున్నారు. జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో ఎండ తీవ్రత మరింత అధికంగా ఉంది. బుధవారం అత్యధిక ఉష్ణోగ్రత 37.5 డిగ్రీలు, అత్యల్ప ఉష్ణోగ్రత 24.0గా నమోదైనట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. మంగళవారం 39.1 డిగ్రీలుగా నమోదైన ఉష్ణోగ్రత బుధవారానికి తగ్గినప్పటికీ వడగాడ్పులు మాత్రం ఆగలేదు. వివిధ పనులపై పట్టణానికి వచ్చిన గ్రామీణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పలు రహదార్లలో జనసంచారం పెద్దగా కనిపించలేదు. వడగాడ్పుల కారణంగా పలువురు పురుషులు, మహిళలు తలపై తువ్వాళ్లు, చీర చెంగులు కప్పుకుని ఎండ నుంచి కాస్త ఉపశమనం పొందారు. శీతలపానీయాలు తాగేందుకు చాలామంది ఎగబడ్డారు. పలుచోట్ల స్వచ్ఛంద సంస్థలు చల్లటి మజ్జిగను పంపిణీ చేయడంతో పాదచారులు గొంతు తడుపుకుని ఉపశమనం పొందారు. మరో రెండు రోజులు వడగాల్పులు ఎక్కువగా ఉంటాయని వాతావరణశాఖ సూచిస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇదిలావుంటే, గత మూడు రోజులు కాస్తున్న తీవ్ర ఎండలతో పరవాడ పరిసర ప్రాంతాల ప్రజలు అల్లాడిపోతున్నారు. బుధవారం ఉదయం పదకొండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండ తీవ్రత తగ్గ లేదు. 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యాయి. ఈ కారణంగా ప్రధాన రహదారులన్నీ జన సంచారం లేక నిర్మానుష్యంగా కనిపించాయి. అలాగే, బుధవారం వీచిన వడగాల్పులకు కోటవురట్ల మండల వాసులు అల్లాడిపోయారు. ఉదయం తొమ్మిది గంటల నుంచే వేడి వాతావరణం ప్రారంభమైంది. దీంతో జనం రోడ్లపై రావాలంటేనే హడలిపోయారు. 38 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో పిల్లలు, వృద్ధులు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఉపాధి కూలీలు సైతం పనులను ముగించుకుని ఉదయం పది గంటలకే ఇంటిముఖం పడుతున్నారు. చాలాచోట్ల రోడ్లు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి.

నారాయణీ అవతారంలో లలితాంబిక



సబ్బవరం, ఏప్రిల్ 10 : మండలంలోని దేవీపురంలో లలితాంబిక నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా అమ్మవారు బుధవారం నారాయణీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా హోమాన్ని నిర్వహించారు. గురుపత్ని అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ వేడుకల్లో శ్రీవిద్యా ట్రస్టు నిర్వాహకులు కందర్ప రమా, ప్రభాకర్‌లతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

19న దిబ్బవీధిలో అప్పన్న తిరు కల్యాణోత్సవం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 10 : ఇక్కడి దిబ్బవీధిలో గల వరాహ లక్ష్మీనృసింహ ఆలయంలో స్వామివారి తిరు కల్యాణోత్సవం ఈ నెల 19వ తేదీన జరగనుంది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను టీడీపీ నాయకులు దాడి రత్నాకర్ బుధవారం ఆవిష్కరించారు. ఈ ఆలయాన్ని మళ్ల దాసుడు తాతయ్య నిర్మించారన్నారు. సింహాచలం ఆలయంలో వల్లే ఇక్కడ ఆలయ నిర్వాహకులు మళ్ల రామచంద్రరావు ఆధ్వర్యంలో నిత్యం పూజాదికాలు జరుపుతారన్నారు. మే 10వ తేదీన స్వామివారి నిజరూప దర్శనం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమా, కొణతాల భాస్కరరావు, వీధి పెద్దలు పాల్గొన్నారు.

కొత్తపేటలో శ్రీరామ నవమికి భారీ ఏర్పాట్లు

ఎలమంచిలి, ఏప్రిల్ 10 : పట్టణంలోని కొత్తపేటలో గల చారిత్రాత్మక సీతారాముల ఆలయంలో శ్రీరామ నవమిని ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ముహూర్తపు రాటకు ఏర్పాట్లు చేపట్టారు. ఏటా ఇక్కడ ఈ వేడుకలను వైభవోపేతంగా నిర్వహిస్తుంటారు. పట్టణంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి ఆదర్శ దంపతులను దర్శించుకుంటుంటారు.

రామాలయంలో సప్తాహం ప్రారంభం

నక్కపల్లి, ఏప్రిల్ 10 : ఉపమాక మెరకవీధి కోదండ రామాలయంలో బుధవారం ఉదయం సప్తాహం ప్రారంభమైంది. శ్రీనివాసా భజన భక్త సమాజం, గ్రామస్తుల ఆధ్వర్యంలో ముందుగా ఆలయంలోని సీతారాముల వారికి వేదపండితులు పూజలు నిర్వహించారు. అనంతరం మాడవీధుల్లో నగర సంకీర్తన చేశారు. ఏప్రిల్ 17 వరకూ ఏడు రోజుల పాటు ఈ సప్తాహం (భజన) జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. పాయకరావుపేట నియోజకవర్గంలోని పలు భజన మండలి సభ్యులు, మహిళా భజన సమాజాలు పాల్గొంటున్నట్టు చెప్పారు.

నియోజకవర్గ ఆర్వో కార్యాలయం మార్పు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 10 : నియోజకవర్గ ఎన్నికల రిట్నరింగ్ అధికారి కార్యాలయం స్థానిక గుండాల జంక్షన్ వద్ద గల కల్యాణ మండపంలోకి మార్పు చేశారు. ఇప్పటి వరకు ఈ కల్యాణ మండపంలో వార్డు సచివాలయాలు, సమావేశ మందిరాలు ఉండేవి. జీవీఎంసీ అధికారులు ఈ కల్యాణ మండపంలోని పైభాగంలో ఆర్వో కార్యాలయాన్ని తయారు చేశారు. దీంతో ఇప్పటి వరకు స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సాగిన పరిపాలన కల్యాణ మండపంలోకి మారింది. మంగళవారం ఆర్వో, జేసీ జాహ్నవి కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

భవిత కేంద్రంలో ప్రపంచ ఆటిజం దినోత్సవం

కశింకోట, ఏప్రిల్ 10 : మేజర్ పంచాయతీ కశింకోట ఎంపీపీ పాఠశాల ప్రాంగణంలో గల భవిత కేంద్రంలో ప్రపంచ ఆటిజం దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయిని సత్యవతి, ఉపాధ్యాయుడు కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆటిజం వ్యాధి కాదని, మెదడులోని కొన్ని రసాయన మార్పుల వల్ల వచ్చే బుద్ధి మాంద్యమని పేర్కొన్నారు. ఇటువంటి లక్షణాలు ఉన్న పిల్లలకు శిక్షణ ఇస్తే ఇతర పిల్లలకంటే ప్రతిభ చూపగలరని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామునాయుడు, శ్రీనివాస్, బి.వి.రమణమ్మ, ఎస్.దీప తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీ హయాంలోనే బీసీలకు న్యాయం'

పాయకరావుపేట, ఏప్రిల్ 10 : టీడీపీ హయాంలోనే రాష్ట్రంలో బీసీలకు సముచిత న్యాయం జరిగిందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు అన్నారు. బుధవారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో బీసీ నాయకుడు చింతకాయల రాంబాబు అధ్యక్షతన పాయకరావుపేట క్లస్టర్-3 పరిధిలోని బీసీ నాయకులతో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో ఎస్సీలు, బీసీలు, మైనార్టీలకు చేసింది ఏమీ లేదన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటైతే బీసీలకు మరింత న్యాయం జరుగుతుందన్నారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు, బీసీ నాయకులు చింతకాయల రాంబాబు, బొంది కాశీవిశ్వనాథం, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీనుతోపాటు బీసీ నాయకులు మలిపెద్ది వెంకటరమణ, లెక్కల గోవింద్, జూరెడ్డి ప్రసాద్, వేములపూడి అప్పారావు, బత్తిన అచ్చిరాజు, పి.సూరిబాబు, దొంగల శ్రీను, ఎల్లపు సతీష్, దువ్వి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ కోర్సులపై విద్యార్థులకు అవగాహన

నక్కపల్లి, ఏప్రిల్ 10 : మండలంలోని గొడిచెర్ల జడ్పీ హైస్కూల్‌లో టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థులకు ఒకేషనల్ కోర్సులపై అవగాహన కల్పించారు. పాయకరావుపేట ఐటీఐ కళాశాలకు గొడిచెర్ల హైస్కూల్ విద్యార్థులను తీసుకువెళ్లారు. ఒకేషనల్ టెక్నికల్ కోర్సులు నేర్చుకోవడం ద్వారా మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చునని ఐటీఐ కళాశాల ఇన్‌స్ట్రక్టర్లు సూచించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం ప్రతాపరావు, వృత్తి ఉపాధ్యాయులు ఎం.సాయి చందు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత

తుమ్మపాల, ఏప్రిల్ 10 : గ్రామాల్లో బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని ఏసీడీపీవో శశికళ కోరారు. బవులవాడ పంచాయతీ ఆర్‌వీఎస్ నగర్‌లో చిన్నారుల తల్లిదండ్రులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో మూఢ ఆచారాలను విడనాడాలని సూచించారు. బాల్య వివాహాలు చేయడం ద్వారా ఆడపిల్లల ఆరోగ్య మానసిక పరిస్థితులు భయానకంగా మారిపోయే ప్రమాదముందన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీని చేపట్టారు. ఐసీడీఎస్ సిబ్బంది వెంకటలక్ష్మి, కోటా లక్ష్మి, కృష్ణవేణి, ఉపాధ్యాయిని రాము, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరిక

రాంబిల్లి, ఏప్రిల్ 10 : మండలంలోని జడ్.చింతువా పంచాయతీ వెంకయ్యపాలెం వైసీపీకి చెందిన పలువురు టీడీపీలో చేరారు. వీరికి అచ్యుతాపురంలోని పార్టీ కార్యాలయంలో ఎలమంచిలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. మండల తెలుగుయువత అధ్యక్షుడు ఎరిపల్లి అజయ్, మాజీ సర్పంచ్ ఎరిపల్లి చిట్టిబాబు, టీడీపీ రాంబిల్లి మండల శాఖ మాజీ అధ్యక్షుడు రవిరాజుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జడ్.చింతువా గ్రామ టీడీపీ అధ్యక్షుడు చెల్లూరి ఆనంద్, జి.గోవింద్, రమేష్, బుజ్జి ఎం.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'ఓటమి భయంతోనే వైసీపీ తప్పుడు ప్రచారం'


ఎస్పీకి ఫిర్యాదు చేసిన కాపీ చూపుతున్న సీఎం రమేశ్ తనయుడు రిత్విక్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే పీలా

అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 10 : ఓటమి భయంతోనే వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తుందని అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ తనయుడు రిత్విక్ ఆరోపించారు. ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీఎం రమేష్ సోదరుడు రాజేష్‌పై అనకాపల్లిలోని వాట్సాప్ గ్రూపులు, సామాజిక మాధ్యమాల్లో ఫేక్‌న్యూస్ వైరల్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం ఆయన ఎస్పీ కేవీ మురళీకృష్ణను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం మాట్లాడుతూ స్థానిక వైసీపీ నాయకుల ప్రోద్బలంతోనే ఇటువంటి అసత్య కథనాలు వ్యాప్తి అవుతున్నాయన్నారు. ఎస్పీని కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఫార్మాలో ప్రమాదాలపై విచారణకు వినతి

పరవాడ, ఏప్రిల్ 10 : ఫార్మాసిటీలో ఇటీవల జరిగిన ప్రమాదాలపై సమగ్ర విచారణ చేపట్టి యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, వీవీ శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం జేసీ జాహ్నవిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఆల్కలీ మెటల్స్ అపిటోరియా ఫార్మా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లనే ఇద్దరు కార్మికులు ప్రాణాలు కోల్పోయారన్నారు. భద్రత పాటించని యాజమాన్యాల పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యసేవలందించాలని, వారందరికీ సెలవుతో కూడిన వేతనాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫార్మా పరిశ్రమల్లో కార్మిక చట్టాలు అమలు చేయడంతో పాటు భద్రతపై అన్ని పరిశ్రమల్లోనూ సోషల్ ఆడిట్ నిర్వహించాలన్నారు. భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా కఠిన చర్యలు చేపట్టాలని వారు కోరారు.

సాంకేతిక వనరులు సద్వినియోగం చేసుకోవాలి

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 10 : సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు తమకు అందుబాటులో ఉన్న సాంకేతిక వనరులను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ వీఆర్ శంకర్‌చీల సూచించారు. దైట్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు లేటెస్ట్ స్కినారియోస్ ఇన్ సివిల్ వాటర్ రిసోర్సెస్ అండ్ ఎన్విరాన్మెంట్ ఇంజనీరింగ్‌పై గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సదరు విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వైకుంఠరావు, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఎ.దేవీప్రసాద్, స్టూడెంట్ చాప్టర్ కన్వీనర్ హేమంత్‌కుమార్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

సీపీఎం నేత రామునాయుడుకు నివాళి

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 10 : ఇక్కడి సీపీఎం కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ విశాఖ ఉమ్మడి జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కమిటీ సభ్యుడు దొడ్డి రామునాయుడు వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, వీవీ శ్రీనివాసరావు, గంటా శ్రీరామ్, ఎ.రాజు తదితరులు పాల్గొన్నారు.



'ఉమ్మడి అభ్యర్థుల విజయంతోనే రాష్ట్ర ప్రగతి'


అనిత, బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ సతీమణి శ్రీదేవి ప్రచారం

కోటవురట్ల/ఎస్.రాయవరం, ఏప్రిల్ 10 : ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో నష్టపోయిందని, మళ్లీ పూర్వ వైభవం రావాలంటే చంద్రబాబు వంటి సమర్థుడు ముఖ్యమంత్రి కావాలని పాయకరావుపేట అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిని వంగలపూడి అనిత అన్నారు. బుధవారం ఆమె బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ సతీమణి శ్రీదేవితో కలిసి మండలంలోని రామచంద్రపురం, గూడపులోవ, ములగల్లోవ, పందూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారిరువురూ మాట్లాడుతూ ఉమ్మడి అభ్యర్థులు విజయం సాధిస్తే రాష్ట్రం ప్రగతి పథాన పయనిస్తుందన్నారు. జిల్లాలో సమస్యల పరిష్కారానికి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్, పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనితను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని శ్రీదేవి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ సందరంగా పందూరులో వైసీపీ నాయకుడు చికెట్ల భాస్కరరావుతోపాటు పలువురు కార్యకర్తలు టీడీపీలో చేరారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, జనసేన పార్టీ సీనియర్ నాయకుడు గెడ్డం బుజ్జి, టీడీపీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు, ఎస్.రాయవరం మాజీ ఎంపీపీ వినోద్‌రాజు, పెట్ల లింగంనాయుడు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, ఎస్.రాయవరం మండలం పెట్టుగోళ్లపల్లిలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనిత ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో ప్రవేశపెట్టనున్న సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. అంతకుముందు గ్రామంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి అల్లు నరసింహమూర్తి ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 60 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, మాజీ ఎంపీపీ యేజెర్ల వినోద్‌రాజు, నాయకులు ఎన్.వెంకటరాజు, కురందాసు నూకరాజు, పల్లెల జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.



'పాలీసెట్' విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ


విద్యార్థిని స్టడీ మెటీరియల్ అందిస్తున్న డిప్యూటీ డీఈవో

ఎస్.రాయవరం, ఏప్రిల్ 10 : పెదగుమ్ములూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో పాలీసెట్‌కు హాజరు కానున్న విద్యార్థులకు ఉచిత శిక్షణ తరగతులను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలోని విద్యార్థులందరికీ పీఆర్‌టీయూ, వింగ్స్ ఫౌండేషన్ ఫౌండర్ ఆనంద్, చైర్మన్ జయప్రకాష్ ఆధ్వర్యంలో రూ.13,500 విలువ చేసే పాలిటెక్నిక్ స్టడీ మెటీరియల్‌ను సమకూర్చారు. వీటిని డిప్యూటీ డీఈవో పెన్నాడ అప్పారావు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్ చేతుల మీదగా బుధవారం అందజేశారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భద్రరావు, కార్యదర్శి శ్రీనివాసరావు, సమన్వయకర్త సత్యనారాయణ, పలు మండలాలకు చెందిన యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ నిబంధనలను విధిగా పాటించాలి : ఆర్వో


రాజకీయ నాయకులకు సూచనలిస్తున్న ఆర్వో మనోరమా

ఎలమంచిలి, ఏప్రిల్ 10 : ఎన్నికల కమిషన్ నిబంధనలను రాజకీయ పార్టీల నేతలంతా విధిగా పాటించాలని రిటర్నింగ్ ఆఫీసర్ మనోరమా సూచించారు. ఇక్కడి తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆమె వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం మొదలుకుని ప్రతి రోజూ వెచ్చించే వ్యయం తదితర వివరాలను విధిగా తెలియజేయాలన్నారు. అనంతరం పోస్టల్ బ్యాలెట్, ఓటింగ్, నామినేషన్ ప్రక్రియ తదితరాలకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



స్వయం ఉపాధి శూన్యం

... 5వ పేజీ తరువాయి

ఆర్థిక సహాయం, నేతన్నలకు పావలా వడ్డీకి రుణాలు, కొత్త మగ్గాలు కొనుగోలుకు సబ్సిడీలు, మల్బరీ తోటల పెంపకానికి ప్రోత్సాహం, గీత కార్మికుల సొసైటీలకు ఆర్థిక సాయం, ఈత, తాటిచెట్ల పెంపకానికి ప్రోత్సాహం, గొర్రెలు, మేకలు పెంపకానికి ప్రోత్సా హంతోపాటు ఆయా కులాలు ఆర్థికంగా, సామా జికంగా అభివృద్ధి చెందేందుకు అవసరమైన సహకారాన్ని కార్పొరేషన్లు అందించేవి. ఆదరణ పేరుతో వివిధ వృత్తులు చేసుకునే వారికి అవసరమైన పరికరాలను పెద్దఎత్తున పంపిణీ చేశారు. రజకులకు ఇస్త్రీ పెట్టెలు, లాండ్రీ మిషన్లు, దోబీ ఖానాలు అభివృద్ధికి అవసరమైన నిధులు, నాయీ బ్రాహ్మ ణులకు అవసరమైన పరికరాలు, కమ్మరి, కుమ్మరి, మత్స్య కారులకు అవసరమైన పరికరాలను ఉచితంగా అందించి వారి వృత్తుల్లో మరింత మెరుగైన పనితీరు కనబరిచేలా చేసి మరింత ఆదాయాన్ని పొందేందుకు ప్రభుత్వం సహకారాన్ని అందించింది. టీడీపీ ప్రభుత్వం చివరి రెండేళ్లలో బీసీ, ఎస్సీ యువతకు ఆటోలు, వ్యాన్లు ట్రాక్టర్లు, కార్లు వంటి వాహ నాలను అందించింది. వీటి ద్వారా సుమారు 300 మంది వరకూ ఉపాధి పొందారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వెట్టి, జోగినులకు పునరావాస కార్యక్రమాలు, పేదల రైతుల పొలాల్లో బోర్లు, పంపుసెట్లు, విద్యుత్ సౌకర్యం, భూమి అభివృద్ధి, భూమి లేని పేదలకు భూములు కొనుగోలు చేసి అందించడం, వడ్డీ లేని రుణాలు ఇవ్వడం వంటి వాటిని అమలు చేశారు. జగన్ ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌ను మూడు కార్పొరేషన్లుగా విభజించి చైర్మన్లను మాత్రమే నియమించింది. ఈ కార్పొరేషన్ ద్వారా ఎలాంటి పథకాలను అమలు చేయలేదు. ఒక్క పైసా కూడా ఇవ్వలేదు.

ఉపాధికి అవకాశం ఏదీ..?

గత తెలుగుదేశం పార్టీ హయాంలో లక్షల రూపాయలు రుణాలుగా అందించడం ద్వారా యువత స్వయం ఉపాధి పొందేందుకు అనుగుణమైన యూనిట్లు ఏర్పాటుచేసుకునే వారు. కానీ, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆయా పథకాలను పూర్తిగా నిలిపివేసింది. జగనన్న చేదోడు కింద పది వేలు, కాపు నేస్తం కింద రూ.15 వేలు, ఈబీసీ నేస్తం కింద రూ.15 వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని మాత్రమే వైసీపీ చేస్తోంది. ఈ మొత్తాలతో ఉపాధి పొందడం ఎలా సాధ్యమవుతుందని ఆయా కులాలకు చెందినవారే ప్రశ్నిస్తున్నారు. యువత ఉపాధి పొందేందుకు అనుగుణంగా నిధులను అందించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అధికారంలోకి వచ్చిన తరువాత పెళ్లి కానుక, రంజాన్ తోఫా వంటి పథకాలను పూర్తిగా ఆపేసిన వైసీపీ ప్రభుత్వం. ఎన్నికలు దగ్గరపడుతుండడంతో గత ఏడాది నుంచి విదేశీ విద్య, పెళ్లి కానుకను అమలు చేస్తోంది.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు

... 5వ పేజీ తరువాయి

దుప్పితూరులో 10 మంది రాజీనామా చేసినట్టు పేర్కొన్నారు.

మండలంలో 56 మంది..

రాంబిల్లి: మండలంలోని మూడు సచివాలయాల పరిధిలో బుధవారం 56 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్టు ఎంపీడీవో ఎస్.వెంకటాచలం తెలిపారు. పెదకలవలాపల్లి సచివాలయం పరిధిలో 21, వాడనర్సాపురం సచివాలయం పరిధిలో 23 మంది, కొత్తపట్నం సచివాలయం పరిధిలో 12 మంది రాజీనామా చేశారన్నారు.

బి.సింగవరంలో ఐదుగురు

చీడికాడ: మండలంలోని బి.సింగవరం గ్రామానికి చెందిన ఐదుగురు వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. ఎంపీడీవో ఉమామహేశ్వరికి తమ రాజీనామా పత్రాలు అందజేశారు.

సాగునీటి వనరులపై నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

పంపుతున్నారే తప్ప నిధులు మాత్రం విడుదల కావడం లేదు. ఈ ఏడాదైనా ఆనకట్టకు మరమ్మతులు చేపట్టాలని, కాలువల్లో తుప్పలు తొలగించాలని రైతులు కోరుతున్నారు. దీనిపై ఇరిగేషన్ మండల జేఈ సూర్యనారాయణను సంప్రతించగా ధారగెడ్డ ఆనకట్ట మరమ్మతులు, పంట కాలువలు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర నిర్మాణానికి నిధుల కోసం ఐదేళ్ల నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

మట్టిని మింగే ఘనులు

... 5వ పేజీ తరువాయి

పోలీసు, రెవెన్యూ కార్యాలయాలను ఆనుకొని ఉన్న ప్రైవేటు లేఅవుట్ ఫిల్లింగ్‌కు వాడుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. ట్రాక్టర్ మట్టి లోడు రూ.500 నుంచి రూ.700, లారీ లోడు అయితే రూ.4 వేల నుంచి రూ.5వేలు పలుకుతున్నట్టు తెలిసింది. రామన్నపాలెంలో సుమారు 300 ఎకరాల ఏపీఐఐసీ భూముల్లో మట్టిని తవ్వి ప్రైవేటు లేఅవుట్‌కు తరలిస్తున్నారు. సీతన్నఅగ్రహారం ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు జరిపి జి.గంగవరం, దాలింపేట గ్రామాల్లోని ప్రైవేటు లేఅ వుట్లకు తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపో వడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కూటమి విజయంతోనే రాష్ట్రాభివృద్ధి

▸▸ నర్సీపట్నం టీడీపీ అభ్యర్థి అయ్యన్నపాత్రుడు



ప్రచార సభలో మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు

నాతవరం, ఏప్రిల్ 10: మండలంలోని ములగపూడిలో మాజీ మంత్రి, నర్సీపట్నం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అయ్యన్నపాత్రుడు బుధవారం రాత్రి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాయకరావుపేటలో తాండవ షుగర్ ఫ్యాక్టరీని మూసివేయడంతో నర్సీపట్నం, తుని, పాయకరావుపేట నియోజకవర్గాలలో గల రైతులు రోడ్డున పడ్డారన్నారు. ఎన్నికల ముందు జగన్ పాదయాత్రలో తాండవ షుగర్ ఫ్యాక్టరీని ఆధునీకరిస్తామని చెప్పి, మూసివేయించారని ఆరోపించారు. రాష్ట్రం బాగుపడాలన్నా, పరిశ్రమలు రావాలన్నా ఉమ్మడి అభ్యర్థుల గెలుపుతోనే సాధ్యమన్నారు. మాజీ జడ్పీటీసీ కరక సత్యనారాయణ, నాయకులు నందిపల్లి వెంకటరమణ, పెట్ల వెంకట్, మాజీ సర్పంచ్ ఇటంశెట్టి రాధారత్నకుమారి, బాలనాయుడు జనసేన, బీజేపీ నాయకులు సూర్యచంద్ర లాలం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

'మరిడి మహాలక్ష్మి ఆభరణాలు అప్పగిస్తా'

నర్సీపట్నం, ఏప్రిల్ 10 : పట్టణంలో కొలువుదీరిన మరిడి మహాలక్ష్మి అమ్మవారి ఆభరణాలు తన వద్దే ఉన్నాయని, పండగ రోజు గ్రామ పెద్దల సమక్షంలో దేవదాయ శాఖ అధికారులకు అప్పగిస్తానని చింతకాలయ సన్యాసిపాత్రుడు స్పష్టం చేశారు. బుధవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ పట్టణ ప్రజల విరాళాలతో పాటు కొంత తమ కుటుంబ సభ్యులు వేసుకొని పండగ జరిపించేవారమన్నారు. 2018 తర్వాత కరోనా కారణంగా పండగ సరిగాజరగలేదన్నారు. అమ్మవారి డబ్బులు రూ.6 లక్షలు బ్యాంక్ ఖాతాలో వేశామని, వడ్డీ డబ్బులు గుడి నిర్వహణకు వాడేవారిమని వివరించారు. ఆ డబ్బులు తన ప్రమేయం లేకుండా డ్రా చేసేశారని ఆరోపించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

తొమ్మిది వందల లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

గొలుగొండ, ఏప్రిల్ 10 : కంఠారం శివారులో బుధవారం దాడులు నిర్వహించి తొమ్మిది వందల లీటర్ల బెల్లం ఊట ఊటను ధ్వంసం చేసటినట్టు ఎస్ఐ కృష్ణారావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు అక్కడికి సిబ్బందితో వెళ్లి దాడి చేశామన్నారు. అనంతరం సారా తయారీకి ఉపయోగించే సామగ్రిని సైతం స్వాధీనపర్చుకున్నట్టు చెప్పారు.

పకడ్బందీగా ఎన్నికలు

▸▸ సెక్టార్ అధికారులకు ఈవీఎంలపై రేపు శిక్షణ

▸▸ వృద్ధుల అభిప్రాయం మేరకు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తులు

▸▸ అధికారుల సమావేశంలో ఆర్వో జయరాం



సెక్టార్ అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్వో జయరాం

నర్సీపట్నం, ఏప్రిల్ 10 : సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్టు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి హెచ్‌వీ జయరాం తెలిపారు. సెక్టార్ అధికారులతో బుధవారం ఇక్కడి నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 12 తేదీన సెక్టార్ అధికారులకు ఈవీఎంపై శిక్షణ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 85 సంవత్సరాల వృద్ధులు, దివ్యాంగులు, బెడ్ రెస్ట్‌లో ఉన్న ఓటర్లను గుర్తించి, వారి అభిప్రాయం తీసుకొని పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేయించాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో మరుగుదొడ్లు, విద్యుత్, ర్యాంప్‌లు వంటి మౌలిక సదుపాయాలు మరోసారి తనిఖీ చేయాలన్నారు. ఏమైనా లోపాలు ఉంటే గుర్తించి నివేదిక ఇవ్వాలని సూచించారు. ఈనెల 15, 16 తేదీలలో పీవోలు, ఏపీవోలకు సెక్టార్ అధికారులు శిక్షణ ఇవ్వాలన్నారు. అనంతరం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై రిటర్నింగ్ అధికారి జయరాం సమావేశం నిర్వహించారు.

అందుబాటులో ఉండని సచివాలయ సిబ్బందిపై చర్యలు

▸▸ ఎంపీడీవో చంద్రరావు



సచివాలయ సిబ్బంది హాజరుపై ఆరా తీస్తున్న ఎంపీడీవో

మాకవరపాలెం, ఏప్రిల్ 10 : సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో చంద్రరావు ఆదేశించారు. మండలంలోని పైడిపాల, పాపయ్యపాలెం, బూరుగుపాలెం సచివాలయాలను బుధవారం తనిఖీ చేశారు. పాపయ్యపాలెం పంచాయతీ కార్యదర్శి విధులకు గైర్హాజరు కావడంతో నెల జీతం నిలుపుదల చేస్తూ మెమో జారీ చేసినట్టు ఆయన తెలిపారు. అనంతరం ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఎండలు ముదురుతున్నందున కూలీలు పనులకు చకచకా ముగించుకుని ఇళ్లకు చేరుకోవాలన్నారు. పని ప్రదేశంలో పలు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా సూచించారు. అనంతరం పాపయ్యపాలెంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు వివరించారు. సచివాలయాల్లో కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది విధులకు డుమ్మా కొడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మండుతున్న ఎండలతో జనం అవస్థలు



ఎండ ధాటికి నిర్మానుష్యంగా మారిన గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట రహదారి

నర్సీపట్నం/ కృష్ణాదేవి పేట, ఏప్రిల్ 10 : ఎండలు మండిపోతుండడంతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు గత మూడు నాలుగు రోజులుగా వడగాల్పులు వీస్తుండడం మరింత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఇళ్లలో ఉన్నా, రోడ్లపైకి వచ్చినఅ ఉక్కపోత తప్పడం లేదు. పిల్లలు, వృద్ధుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. బుధవారం నర్సీపట్నంలో 37 డిగ్రీలు ఉష్ణోగత నమోదైంది. ఎండ తీవ్రతకు రోడ్లపైకి రావాలంటేనే జనం హడలిపోతున్నారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి వేసవి ఆరంభంలోనే ఇలా ఉంటే మున్ముందు పరిస్థితి ఏమిటని పలువురు ఆందోళన చెందుతున్నారు. అలాగే భానుడి ఉగ్ర రూపానికి గొలుగొండ మండల ప్రజానీకం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుధవారం గొలుగొండ, ఏఎల్‌పురం, పాత కృష్ణాదేవిపేట, చోద్యం, ఏఎల్‌పురం, లింగంపేట తదితర గ్రామాల్లో ప్రధాన రహదారులు మధ్యాహ్నం వేళ నిర్మానుష్యంగా కనిపించారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఎండ ధాటి తగ్గడం లేదు.

నర్సీపట్నం కాంగ్రెస్ అభ్యర్థిగా శ్రీరామమూర్తి



నర్సీపట్నం, ఏప్రిల్ 10: నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎరకన్నపాలెం గ్రామానికి చెందిన రుత్తల శ్రీరామమూర్తి పేరును ఏఐసీసీ ఖరారు చేసింది. శ్రీరామమూర్తి 2019లో కాంగ్రెస్ అనకాపల్లి పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేశారు. ఇంజనీరింగ్ వరకు చదువుకున్న ఆయన రెండు సాఫ్ట్‌వేర్ కంపెనీలు నిర్వహిస్తున్నారు. 2020-23 వరకు డీసీసీ అధ్యక్షుడిగా, పీసీసీ, ఏఐసీసీ, పొలిటికల్ ఎఫైర్స్ సమన్వయ కమిటీ సభ్యుడిగా పదవులు చేపట్టారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు

... 5వ పేజీ తరువాయి

దుప్పితూరులో 10 మంది రాజీనామా చేసినట్టు పేర్కొన్నారు.

మండలంలో 56 మంది..

రాంబిల్లి: మండలంలోని మూడు సచివాలయాల పరిధిలో బుధవారం 56 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్టు ఎంపీడీవో ఎస్.వెంకటాచలం తెలిపారు. పెదకలవలాపల్లి సచివాలయం పరిధిలో 21, వాడనర్సాపురం సచివాలయం పరిధిలో 23 మంది, కొత్తపట్నం సచివాలయం పరిధిలో 12 మంది రాజీనామా చేశారన్నారు.

బి.సింగవరంలో ఐదుగురు

చీడికాడ: మండలంలోని బి.సింగవరం గ్రామానికి చెందిన ఐదుగురు వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. ఎంపీడీవో ఉమామహేశ్వరికి తమ రాజీనామా పత్రాలు అందజేశారు.

స్వయం ఉపాధి శూన్యం

... 5వ పేజీ తరువాయి

ఆర్థిక సహాయం, నేతన్నలకు పావలా వడ్డీకి రుణాలు, కొత్త మగ్గాలు కొనుగోలుకు సబ్సిడీలు, మల్బరీ తోటల పెంపకానికి ప్రోత్సాహం, గీత కార్మికుల సొసైటీలకు ఆర్థిక సాయం, ఈత, తాటిచెట్ల పెంపకానికి ప్రోత్సాహం, గొర్రెలు, మేకలు పెంపకానికి ప్రోత్సా హంతోపాటు ఆయా కులాలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేందుకు అవసరమైన సహకారాన్ని కార్పొరేషన్లు అందించేవి. ఆదరణ పేరుతో వివిధ వృత్తులు చేసుకునే వారికి అవసరమైన పరికరాలను పెద్దఎత్తున పంపిణీ చేశారు. రజకులకు ఇస్త్రీ పెట్టెలు, లాండ్రీ మిషన్లు, దోబీ ఖానాలు అభివృద్ధికి అవసరమైన నిధులు, నాయీ బ్రాహ్మ ణులకు అవసరమైన పరికరాలు, కమ్మరి, కుమ్మరి, మత్స్య కారులకు అవసరమైన పరికరాలను ఉచితంగా అందించి వారి వృత్తుల్లో మరింత మెరుగైన పనితీరు కనబరిచేలా చేసి మరింత ఆదాయాన్ని పొందేందుకు ప్రభుత్వం సహకారాన్ని అందించింది. టీడీపీ ప్రభుత్వం చివరి రెండేళ్లలో బీసీ, ఎస్సీ యువతకు ఆటోలు, వ్యాన్లు ట్రాక్టర్లు, కార్లు వంటి వాహనాలను అందించింది. వీటి ద్వారా సుమారు 300 మంది వరకూ ఉపాధి పొందారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వెట్టి, జోగినులకు పునరావాస కార్యక్రమాలు, పేదల రైతుల పొలాల్లో బోర్లు, పంపుసెట్లు, విద్యుత్ సౌకర్యం, భూమి అభివృద్ధి, భూమి లేని పేదలకు భూములు కొనుగోలు చేసి అందించడం, వడ్డీ లేని రుణాలు ఇవ్వడం వంటి వాటిని అమలు చేశారు. జగన్ ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌ను మూడు కార్పొరేషన్లుగా విభజించి ఛైర్మన్లను మాత్రమే నియమించింది. ఈ కార్పొరేషన్ ద్వారా ఎలాంటి పథకాలను అమలు చేయలేదు. ఒక్క పైసా కూడా ఇవ్వలేదు.

ఉపాధికి అవకాశం ఏదీ..?

గత తెలుగుదేశం పార్టీ హయాంలో లక్షల రూపాయలు రుణాలుగా అందించడం ద్వారా యువత స్వయం ఉపాధి పొందేందుకు అనుగుణమైన యూనిట్లు ఏర్పాటు చేసుకునే వారు. కానీ, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆయా పథకాలను పూర్తిగా నిలిపివేసింది. జగనన్న చేదోడు కింద పది వేలు, కాపు నేస్తం కింద రూ.15 వేలు, ఈబీసీ నేస్తం కింద రూ.15 వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని మాత్రమే వైసీపీ చేస్తోంది. ఈ మొత్తాలతో ఉపాధి పొందడం ఎలా సాధ్యమవుతుందని ఆయా కులాలకు చెందినవారే ప్రశ్నిస్తున్నారు. యువత ఉపాధి పొందేందుకు అనుగుణంగా నిధులను అందించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అధికారంలోకి వచ్చిన తరువాత పెళ్లి కానుక, రంజాన్ తోఫా వంటి పథకాలను పూర్తిగా ఆపేసిన వైసీపీ ప్రభుత్వం.. ఎన్నికలు దగ్గరపడుతుండడంతో గత ఏడాది నుంచి విదేశీ విద్య, పెళ్లి కానుకను అమలు చేస్తోంది.



ముకుందపురం వద్ద కోతకు గురై ఆనవాలు లేని రోడ్డు



వడ్డాది శివారున ఛిద్రమైన దృశ్యం

రహదారి ఛిద్రం.. ప్రయాణం నరకం

▸▸ వడ్డాది-పాడేరు ఆర్ అండ్ బీ రోడ్డు దుస్థితి

▸▸ వాహనదారులకు తప్పని తిప్పలు

మాడుగుల రూరల్, ఏప్రిల్ 10: మండలంలోని వడ్డాది-పాడేరు ఆర్ అండ్ బీ రోడ్డు ఎక్కడికక్కడ గుంతలు పడి, అంచులు కోతకు గురై అధ్వానంగా మారింది. వడ్డాది జంక్షన్ నుంచి ఘాట్‌రోడ్డు జంక్షన్ వరకు ఆరు కిలోమీటర్లూ ఇదే దుస్థితి. ఈ ఈమార్గంలో ముకుందపురం, కేజే పురం, ఎం.కోటపాడు, ఎంకే వల్లాపురం గ్రామాలున్నాయి. మాడుగుల నుంచి చోడవరం, అనకాపల్లి, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు వెళ్లాలన్నా ఈ మార్గమే ప్రధానం. మైదాన ప్రాంతం నుంచి పాడేరు అల్లూరి జిల్లా మన్యం ప్రాంతాలకు ఈ మార్గం ఎంతో వీలుగా ఉంటుంది. అయితే, రోడ్డు అడుగడుగునా గోతులతో అనవాలులేనంతగా ఛిద్రమైంది. రోడ్డు అంచులు కోతకు గురై ప్రమాదాలు జరుగుతున్నాయి. గుంతలను దాటుకుని వెళ్లడం వాహనచోదకులకు సాహసోపేతంగా మారింది. వాహనాల్లో వెళ్తుంటే ఒళ్లంతా హూనమైపోతున్నదని ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. రహదారి ఇంత అధ్వానంగా ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని వాపోతున్నారు. సకాలంలో నిధులు మంజూరు చేసి రోడ్డు పనులు చేపట్టాల్సి పాలకులు మిన్నకుంటున్నారని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగేళ్లుగా అధ్వానంగా ఉన్నా పట్టించుకోకపోవడం దారుణమని మండిపడుతున్నారు. ఏదో తూతూ మంత్రంగా గోతుల్లో క్రషర్‌బుగ్గి, రాళ్లు వేసి పూడ్చడం తప్పితే, శాశ్వత పరిష్కార దిశగా చర్యలు తీసుకోలేదని వాపోతున్నారు.

ఘనంగా వసంత నవరాత్రి మహోత్సవాలు



వడ్డాదిలో సీతారామస్వామి

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 10: శ్రీరామనవమి సందర్భంగా వడ్డాది సీతారామాలయంలో వసంత నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దేవాలయ అర్చకులు ఎం.కృష్ణ శర్మ ఆధ్వర్యంలో మంగళరం నుంచి ప్రారంభమైన ఈ మహోత్సవాల్లో భాగంగా రోజూ స్వామి వారికి పూజాదికాలు, సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం చేపడుతున్నారు. ఈ నెల 17వ తేదీన శ్రీరామ నవమి రోజున సీతారాముల కల్యాణంతో మహోత్సవాలు ముగియనున్నాయని కృష్ణశర్మ తెలిపారు.

'నామినేషన్‌కు భారీస్థాయిలో కార్యకర్తలు రావాలి'

చీడికాడ, ఏప్రిల్ 10: కాంగ్రెస్ పార్టీ నుంచి నామినేషన్ వేయడానికి ఈనెల 22వ తేదీన మాడుగులకు భారీ స్థాయిలో కార్యకర్తలను తరలించాలని ఆ పార్టీ మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి, అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొడ్డు శ్రీనివాసరావు కోరారు. చీడికాడలో నాలుగు మండలాల పార్టీ మండల అధ్యక్షులు, జిల్లా నా యకులతో బుధవారంసమావేశం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ విడుదల చేసి మ్యానిఫెస్టో వివరించారు.

బాలకార్మికులతో పనిచేయిస్తే కఠిన చర్యలు

సహాయ కార్మిక శాఖ అధికారి సూర్యనారాయణ



సీతయ్యపేటలో కేసున మోదు చేస్తున్న అధికారి

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 10: బాలకార్మికులతో పనిచేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చోడవరం సహాయ కార్మిక శాఖ అధికారి పి. సూర్యనారాయణ హెచ్చరించారు. మంగళవారం ఆయన సీతయ్యపేటలో షాపులను తనిఖీ చేశారు. అభిషేకర్ ఫుడ్ ట్రేడర్స్ షాపుల్లో బాలకార్మికుడితో పనిచేయిస్తున్నట్టు గుర్తించిన షాపు యాజమానిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకోరాదన్నారు. షాపుల్లో పనిచేసే కార్మికులకు తాగునీరు, మరుగుదొడ్లు తదితర కనీస సదుపాయం ఏర్పాటుచేయాలని తెలిపారు. కార్మిక చట్టాలను తూచా తప్పకుండా పాటించాలని ఆయన సూచించారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

చోడవరం, ఏప్రిల్ 10: పట్టణంలో బుధవారం వైసీపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ఆధ్వర్యంలో బుధవారం టీడీపీలో చేరారు. స్థానిక వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో కోఆపరేటివ్ కాలనీ, తదితర ప్రాంతాలకు చెందిన వైసీపీ ఎంపీటీసీ సభ్యుడు పి. నాయుడు, పంచాయతీ వార్డు సభ్యుడు కందర్ప శంకర్, స్థానిక నాయకులు గూనూరు ప్రభాకర్, ఉపాధ్యాయుల శ్రీనివాస్ తదితర నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. కాగా, పట్టణ శివారు నరసయ్యపేటకు చెందిన వందమంది వైసీపీ కార్యకర్తలు రాజు సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి పార్టీ నాయకులు కండువా కప్పిపార్టీలోనికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. అవినీతికి తావులేని పాలన అందిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలోబత్తుల తాతయ్యబాబు, తెలుగురైతు ఉపాధ్యక్షుడుగూనూరు మల్లునాయు డు,విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, బీజేపీ నేత శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

'మాడుగుల టీడీపీ టికెట్ 'గవిరెడ్డి'కి కేటాయించాలి'

చీడికాడ, ఏప్రిల్ 10: మాడుగుల నియోజకవర్గ టీడీపీ టికెట్ మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడుకి కేటాయించాలని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బొబ్బాది తాతారావు, ఎంపీటీసీ సభ్యులు పైల ముత్యాలనాయుడు, బీళ్ల కోటేశ్వరరావు, గాడి ప్రసాద్‌తో పాటు పలువురు నాయకులు కోరారు. చీడికాడలో బుధవారం రాత్రి మండలంలోని ముఖ్య నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అధిష్ఠానం 20 రోజుల క్రితం ఈ నియోజకవర్గ అభ్యర్థిగా పైలా ప్రసాదరావుని ప్రకటించిందన్నారు. అయితే, గత 15ఏళ్లుగా పార్టీలో సేవలందిస్తున్న గవిరెడ్డికి టికెట్ ఇవ్వకుంటే ఎన్నికల్లో పార్టీ నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ స్థితిలో అధిష్ఠానం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు గండి ముసలి నాయుడు, పంచాడ దాలెంనాయుడు, బండారు దయాకర్, గాలి బాలకృష్ణ, సిం గంపల్లి నాయుడు, వేపాడనాగేశ్వరరావు, వెచ్చం భీమరాజు, పోతుబంతి రాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు

రావికమతం, ఏప్రిల్ 10: మండలంలో మేడివాడ హైస్కూల్ ప్రత్యేక ఉపాధ్యాయుడు బి. మహాలక్ష్మినాయుడును సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి అభినందించారు. ఈ మేరకు బుధవారం అమరావతి ప్రాజెక్టు కార్యాలయంలో మహాలక్ష్మినాయుడుకు ప్రశంసా పత్రం అందజేశారు. ట్యాబ్‌లు ఉపయోగించడంపై దివ్యాంగ విద్యార్థులకు అవగాహనకు సమగ్ర శిక్ష రూపొందించిన కార్యక్రమాన్ని రాష్ట్రంలో 26 జిల్లాల ప్రత్యేక ఉపాధ్యాయులకు వివరించడానికి మహాలక్ష్మినాయుడును ఎంపిక చేశారు. గత జనవరి 20 నుంచి మార్చి మూడో తేదీ వరకూ అన్ని జిల్లాల్లో దివ్యాంగులకు విద్య నేర్పడంపై ఆయన శిక్షణ ఇచ్చారు. దీనిలో ఉత్తమ ప్రతిభకు గాను సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ అభినందించడంతోపాటు ప్రశంసా పత్రం అందజేశారు.

'ఆలయ దారిలో మాంసం వ్యర్థాలు నిరోధించాలి'

మాడుగుల, ఏప్రిల్ 10: స్థానిక బస్టాండ్ నుంచి మోదకొండమ్మ అమ్మ వారి ఆలయానికి వెళ్లే దారిలో దుకాణదారులు మాంసం వ్యర్థాలను పారేస్తుండడంతో స్థానికులు, ఆలయానికి వెళ్లే భక్తులు వాసన భరించలేక అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శి చీపురుపల్లి నాయుడుకి ఆలయ కమిటీ సభ్యులు ఫిర్యాదులు చేశారు. మాంసం దుకాణదారులు వ్యర్థాలను వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని ఆరోపించారు.

వడదెబ్బతో వృద్ధురాలి మృతి

చీడికాడ, ఏప్రిల్ 10: మండలంలోని తునివలస గ్రామానికి చెందిన పడాల సత్యవతి (72) వడదెబ్బకు గురై మృతిచెందారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ కాసిన ఎండ, వడగాడ్పులకు ఆమె అస్వస్థతకు గురయ్యారు. వెంటనే సపర్యలు చేసినప్పటికీ తెల్లవారు జాము 2 గంటలకు మృతి చెందారు. కాగా సత్యవతి మాజీ సర్పంచ్ పడాల అప్పలనాయుడు మాతృమూర్తి కావడంతో పలువురు నాయకులు కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.

కుక్కల దాడిలో నాలుగు మేక పిల్లలు మృతి

దేవరాపల్లి , ఏప్రిల్ 10 : మండలంలోని వెంకటాపురంలో వీధి కుక్కల దాడిలో బుధవారం నాలుగు మేక పిల్లలు మృతి చెందాయి. గ్రామం లో కుక్కల బారినపడి గత రెం డు రోజులనుంచి ఇప్పటివరకు 15 వరకు మేకపిల్లలు మృతి చెందినట్లు పెంపకందారులు చెబుతున్నారు. పంచాయతీ అధికారులు వీధి కుక్కలను నిరోధించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.10 వేలు విరాళం

మాడుగుల, ఏప్రిల్ 10: మండల కేంద్రంలోని శ్రీ సీతారామస్వామి ఆలయ అభివృద్ధి పనులకు గాను జనసేన నాయకులు బుధవారం రూ. 10 వేలు విరాళంగా అందించారు. ఆలయం పున నిర్మాణం చేసి ప్రారంభోత్సవం జరిగినప్పటికీ, ఇంకా కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ఆలయానికి రంగులు వేసేందుకు గాను జనసేన నాయకులు రాయపురెడ్డి కృష్ణ, రొబ్బా మహేష్ తదితర నాయకులు, జనసైనికులు ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందించారు.

'అగ్నిప్రమాద బాధితులను ఆదుకోవాలి'

చీడికాడ, ఏప్రిల్ 10: దండిసురవరంలోని అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని జీఎస్ఎన్ ట్రస్టు ఛైర్మన్ గవిరెడ్డి సన్యాసినాయుడు కోరారు. గ్రామంలో బత్తిన గంగరాజు, గండెం వెంకటసూరి అప్పారావు తాలూకా పూరిళ్లు దగ్ధమై సుమారు రూ.10లక్షలు నష్టం వాటిల్లింది. ఈ విషయం తెలుసుకున్న సన్యాసినాయుడు బుధవారం బాధితులను పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ట్రస్టు నుంచి చెరో రూ.5 చొప్పున బాధితులకు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొబ్బాది తాతారావు, వేపాడ నాగేశ్వరరావు, కోన అప్పారావు పాల్గొన్నారు.

ఎండల తీవ్రతకు అల్లాడుతున్న జనం

మాడుగుల రూరల్, ఏప్రిల్ 10: ఎండతీవ్రతకు జనం అల్లాడుతున్నారు. బుధవారం ఉదయం పది గంటల నుంచే ఎండ ఊపందుకుంటున్నది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు మరింత పెరగడంతో రోడ్డుపైకి రావాలంటేనే జనం బెంబేలెత్తిపోతున్నారు. వాహనదారులు రాకపోకలకు భయపడిపోతున్నారు. జన సంచారం లేక ప్రధాన జంక్షన్‌లు, రోడ్లు నిర్మానుష్యమవుతున్నాయి.

వైసీపీ నుంచి జనసేనలో చేరిక

నర్సీపట్నం అర్బన్ , ఏప్రిల్ 10 : మునిసిపాలిటీ పరిధి నాలుగో వార్డులో వైసీపీకి చెందిన నలభై కుటుంబాల వారు బుధవారం జనసేన పార్టీలో చేరారు. వీరికి ఆ పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ సమన్వయకర్త రాజాన వీర సూర్యచంద్ర కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అద్దేపల్లి గణేష్ పాల్గొన్నారు.

మట్టిని మింగే ఘనులు

... 5వ పేజీ తరువాయి

పోలీసు, రెవెన్యూ కార్యాలయాలను ఆనుకొని ఉన్న ప్రైవేటు లేఅవుట్ ఫిల్లింగ్‌కు వాడుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. ట్రాక్టర్ మట్టి లోడు రూ.500 నుంచి రూ.700, లారీ లోడు అయితే రూ.4 వేల నుంచి రూ.5 వేలు పలుకుతున్నట్టు తెలిసింది. అలాగే రామన్నపాలెంలో సుమారు 300 ఎకరాల ఏపీఐఐసీ భూముల్లో మట్టిని తవ్వి ప్రైవేటు లేఅవుట్‌కు తరలిస్తున్నారు. సీతన్నఅగ్రహారం ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు జరిపి జి.గంగవరం, దాలింపేట గ్రామాల్లోని ప్రైవేటు లేఅవుట్లకు తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపో వడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

సాగునీటి వనరులపై నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

పంపుతున్నారే తప్ప నిధులు మాత్రం విడుదల కావడం లేదు. ఈ ఏడాదైనా ఆనకట్టకు మరమ్మతులు చేపట్టాలని, కాలువల్లో తుప్పలు తొలగించాలని రైతులు కోరుతున్నారు. దీనిపై ఇరిగేషన్ మండల జేఈ సూర్యనారాయణను సంప్రతించగా ధారగెడ్డ ఆనకట్ట మరమ్మతులు, పంట కాలువలు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర నిర్మాణానికి నిధుల కోసం ఐదేళ్ల నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.